నవతెలంగాణ
నల్లగొండ
సోమవారం జనవరి 08, 2024 www.navatelangana.com

ఎమ్మెల్యేను కలిసిన హైదరాబాద్ మేయర్



నవతెలంగాణ-నాగార్జునసాగర్

నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి మరియు కాంగ్రెస్ మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి ని బిఆరెస్ నేత కే.కేశవరావు కూతురు హైదరాబాదు మేయర్ విజయ లక్ష్మి హిల్ కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందించి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు వీరితోపాటు నందికొండ కౌన్సిలర్ నిమ్మల ఇందిరాగౌడ్,బిఆర్ఎస్ నాయకులు కొండయ్య గౌడ్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



నవతెలంగాణ-మిర్యాలగూడ

నియోజవర్గంలో పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని సిపిఐ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటిని పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాయం ఉపేందర్ రెడ్డి సిపిఐ మండల కార్యదర్శులు ఎండి సయ్యద్, ధీరవత్ లింగా నాయక్, జిల్లా యాదగిరి, యాదగిరి, వలపట్ల వెంకన్న, గువ్వల అంజయ్య రామలింగం, దాసర్ల దుర్గమ్మ, ఎస్కే షమీం, ఎర్రబోతు పద్మ, ధీరవత్ శాంతమ్మ ఎర్ర ప్రమీల, రాములు, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సరఫరాలో ఇష్టారాజ్యం...!

చిల్లరే కానీ.. లెక్కేస్తే రూ.లక్షలే..!

వంట గ్యాస్ సిలిండరు ధరపై అదనపు వసూళ్లు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం గృహావసరాల గ్యాస్ సిలిండరు ధర బహిరంగ మార్కెట్‌కు అనుగుణంగా మారుతోంది. ఒక్కో నెలలో పెరుగుతూ, మరో నెలలో తగ్గుతూ ఉండటం వల్ల వాస్తవ ధర వినియోగదారులకు స్పష్టంగా తెలిసే పరిస్థితి ఉండటం లేదు. ఇదే ఎక్కువనుకుంటే.. సిలిండరు అసలు ధర కంటే.. ఇంటికి అందించే సమయంలో అదనంగా వసూలు చేస్తుండటం మరింత భారమవుతోంది. ఈ వసూళ్లు చిల్లరగా కనిపించినా.. నెలనెలా ఇది రూ.లక్షల్లో సాగుతోంది.



నవతెలంగాణ-నల్గొండ టౌన్

నల్గొండ పట్టణానికి చెందిన ఓ విశ్రాంత ఉద్యోగి ఇటీవల గ్యాస్ సిలిండరు మీద అదనపు వసూళ్లపై డెలివరీ బాయ్‌ను నిలదీశాడు. వెంటనే ఆ వ్యక్తి.. సిలిండరు ఇవ్వడానికి నిరాకరించాడు. గట్టిగా మాట్లాడితే ఇంటి బయటే సిలిండరు వదిలేశాడు. చేసేదిలేక విశ్రాంత ఉద్యోగి పూర్తి మొత్తం ఇవ్వాల్సి వచ్చింది. నల్గొండ వెంకటేశ్వర కాలనీకి చెందిన ఓ గృహ వినియోగదారుడు పది రోజుల క్రితం గ్యాస్ తెప్పించుకున్నాడు. వాస్తవ సిలిండరు ధర కంటే.. అదనంగా రూ. 30 వసూలు చేశారు. సదరు గృహ వినియోగదారు ఇంటికి, గ్యాస్ గోదాముకు మధ్య దూరం కేవలం రెండు కిలోమీటర్ల లోపే. అయినా ఎక్స్?ట్రా ఛార్జీలు వసూలు చేస్తున్నారు.నల్గొండ జిల్లా కేంద్రంలోని గ్యాస్ ఏజెన్సీకి చైతన్యపురి కాలనీ 5 కి.మీ దూరం లోపే ఉంది. ఇక్కడ వంట గ్యాస్ డోర్ డెలివరీ చేసేందుకు సంబంధిత ఏజెన్సీ డోర్ డెలివరీ బాయ్ సిలిండర్ ధర కంటే అదనంగా 30 రూపాయలు వసూలు చేశాడు. సదరు గృహిణి మారుమాట్లాడకుండా ఆ మొత్తం ఇచ్చేశారు. ఇలా కేవలం నల్గొండ జిల్లాలోనే కాదు.. నల్లగొండ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వంట గ్యాస్ సిలిండరు ధరపై అదనపు వసూళ్లు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం గృహావసరాల గ్యాస్ సిలిండరు ధర బహిరంగ మార్కెట్‌కు అనుగుణంగా మారుతోంది. ఒక్కో నెలలో పెరుగుతూ, మరో నెలలో తగ్గుతూ ఉండటం వల్ల వాస్తవ ధర వినియోగదారులకు స్పష్టంగా తెలిసే పరిస్థితి ఉండటం లేదు. ఇదే ఎక్కువనుకుంటే.. సిలిండరు అసలు ధర కంటే.. ఇంటికి అందించే సమయంలో అదనంగా వసూలు చేస్తుండటం మరింత భారమవుతోంది. ఈ వసూళ్లు చిల్లరగా కనిపించినా.. నెలనెలా ఇది లక్షల్లో సాగుతోంది.

అక్రమ వసూళ్ల దందా..

జిల్లాలో గ్యాస్ సిలిండరు సరఫరా అక్రమ వసూళ్ల దందా ఎప్పటినుంచో సాగుతున్నా.. అధికారులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఒక వైపు బిల్లులపై ఉన్న ధరకు అదనంగా చెల్లించవద్దని ఏజెన్సీ ప్రతినిధులు చెబుతున్నారు. మరోవైపు ఇంటికి తీసుకొచ్చే ఏజెన్సీ సిబ్బంది మాత్రం రూ.20 నుంచి రూ. 50 వరకూ ప్రాంతాన్ని బట్టి వసూలు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోనే సిలిండరుపై రూ.20 నుంచి 30 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. చాలామంది గృహిణులు వాస్తవ మొత్తాన్ని గమనించకుండా అడిగినంతా ఇచ్చేస్తున్నారు. కొంతమంది ప్రశ్నిస్తే.. దురుసుగా ప్రవర్తించడం, సిలిండరు వెనక్కి తీసుకెళ్లిపోయి, తాళం వేసి ఉందని నమోదు చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. మరికొందరు తమకేమీ జీతం ఉండదని, తెచ్చినందుకు ఛార్జీల రూపంలో వచ్చేదే ఆదాయమని చెప్పడంతో మారుమాట్లాడకుండా ఆ మొత్తాన్ని ఇచ్చేస్తున్నారు. గ్యాస్ ఏజెన్సీలు నిర్ణయించిన ధరే తాము వసూలు చేస్తున్నామని చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ. 50కి తక్కువ కాకుండా వసూలు చేస్తున్నారు. గ్రామాల్లో మహిళలు చాలామంది దీపం పథకాన్ని వినియోగిస్తున్నారు. వీరికి ఏజెన్సీలు చాలా కిలోమీటర్ల దూరంలో ఉంటున్నాయి. తాము వెళ్లి సిలిండర్లను తెచ్చుకోలేక, ఇంటికి తీసుకొస్తే అదనపు మొత్తం చెల్లించలేక గ్యాస్ వినియోగానికి దూరం అవుతున్నారు.ఐదు కిలోమీటర్లు దాటితేనే గ్యాస్ సిలిండర్లకు అదనంగా వసూలు చేయవద్దని ఏజెన్సీలకు చెబుతున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు పేర్కొంటున్నారు. సిలిండరు డెలివరీ పరిధి ఐదు కిలోమీటర్ల లోపు ఉంటే ఉచితమేనని, పైసా కూడా అదనంగా చెల్లించాల్సిన అవసరం లేదంటున్నారు. ఐదు నుంచి 30 కిలోమీటర్ల వరకైతే రూ.10 మాత్రమే అదనంగా వసూలు చేస్తారని తెలిపారు. ఏజెన్సీలు, సిబ్బంది వినియోగదారులను ఇబ్బంది పెట్టకూడదని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని అధికారులు వివరించారు.

ఏజెన్సీలు వాడేసుకుంటున్నాయి..

గోదాం నుంచి వినియోగదారుడి ఇంటి వరకు సిలిండరును చేర్చి, ఖాళీ సిలిండరును మళ్లీ గోదాంలో చేర్చేందుకు గాను ప్రతి ఏజెన్సీకి సదరు కంపెనీలు రవాణా ఛార్జీలు చెల్లిస్తాయి. ఆ మొత్తాన్ని సిబ్బందికి ఇచ్చి, ఎమ్మార్పీకే సిలిండర్లను సరఫరా చేయాల్సిన బాధ్యత ఆయా ఏజెన్సీలదే. అయితే కంపెనీలిచ్చిన రవాణా ఛార్జీలను ఏజెన్సీలు వాడేసుకుంటున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఏజెన్సీలు తమకు జీతం ఇవ్వడం లేదని, వినియోగదారుల నుంచే వసూలు చేసుకోవాలంటున్నారని డెలివరీ బాయ్ ఒకరు తెలిపారు. సొంతవాహనంతో బండ చాకిరి చేస్తూ రూ. 20 మాత్రమే గ్యాస్ బండకు వసూలు చేస్తున్నట్లు వివరించాడు.

చిల్లరే అయినా.. లక్షల్లోనే..

ఉమ్మడి జిల్లాలో 71 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. సాధారణ, సీఎస్ఆర్, దీపం కలిపి మొత్తం 8,94,536 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రతి ఇంట్లోనూ గ్యాస్ వినియోగం తప్పనిసరైంది. ఇందులో ప్రతి నెలా క్రమం తప్పకుండా సిలిండరు తీసుకుంటున్న కనెక్షన్లు 4 లక్షలు వేసుకున్నా.. ఒక్కో వినియోగదారుడి నుంచి సగటున రూ. 20 అదనపు వసూళ్లు అనుకున్నా.. మొత్తంగా 80 లక్షల రూపాయలను చెల్లిస్తున్నట్లే. మనం చిల్లరే కదా అని వదిలేసిన మొత్తం ఒక నెలలో రూ. 80 లక్షలు.

చర్యలు తీసుకుంటాం: వెంకటేశ్వర్లు (జిల్లా సివిల్ సప్లయ్ అధికారి)

గ్యాస్ డెలివరీ బాయ్స్ సిలిండర్ సరఫరా సమయంలో అదనంగా రూ.30 వసూలు చేస్తున్నారన్న విషయం మా దృష్టికి రాలేదు. లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారించి చర్యలు చేపడతాం.

యాచకులకు అన్నదానం



నవతెలంగాణ-నల్లగొండటౌన్

ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఇంచార్జీ పిల్లి రామరాజు యాదవ్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని నల్గొండ క్లాక్ టవర్ సెంటర్‌లో నల్లగొండ జిల్లా జనయేత్రి ఫౌండేషన్ జిల్లా అధ్యక్షురాలు కంబాల శివలీల ఆధ్వర్యంలో 20 మంది యాచకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గాదె నరసింహ, దాసోజు కృష్ణమాచారి, సమాచార హక్కుల సమితి రాష్ట్ర అధ్యక్షులు బండమీది అంజయ్య మహేష్, ప్రభుదాసు పాల్గొన్నారు.

మహిళలే ఇంటిల్లిపాదికి ఆధారం

- **శాసనమండలి ఛైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి**



నవతెలంగాణ-నల్గొండటౌన్

మహిళలే ఇంటిల్లిపాదికి ఆధారమని, స్వశక్తితో వారు ఎదగాలనే సంకల్పం గొప్పదని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కొనియాడారు. జననీ, మాతృశ్రీ సంస్థల్లో టైలరింగ్, బ్యూటీషియన్ ట్రైనింగ్ పొందిన నల్లగొండ పట్టణ కేంద్రానికి చెందిన వారికి కుట్టుమిషన్లు, బ్యూటీషియన్ కిట్లను ఆదివారం జిల్లా కేంద్రంలోని గుత్తా వెంకట్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ అమిత్ రెడ్డి మాట్లాడుతూ మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ గుత్తా వెంకట్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ పని చేస్తోందని అన్నారు. మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం ఉంటేనే కుటుంబాన్ని ముందుకు నడపగలరని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కనగల్ జడ్పీటీసీ చిట్ల వెంకటేశం, స్థానిక కౌన్సిలర్ యామ కవిత దయాకర్, అభిమన్యు శ్రీనివాస్, బీఆర్ఎస్ సీనియర్ నేతలు యామ దయాకర్ , ఐతగొని స్వామి గౌడ్, గోపాల్ రెడ్డి, వెంకటేశ్వర రావు, హరికృష్ణ , ఇంద్రసేనా రెడ్డి, జగన్మోహన్ రావు, పరమేష్ , మాతృశ్రీ, జననీ శిక్షణ సంస్థల ఆర్గనైజర్ రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలి

- **సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు దండెంపల్లి సత్తయ్య**

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్



పట్టణంలోని మేళ్ల దుప్పలపల్లి రోడ్‌లో (స్పీడ్ బ్రేకర్స్) వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు దండెంపల్లి సత్తయ్య కోరారు. ఆదివారం 7,8 వార్డుల సీపీఐ(ఎం) శాఖా సమావేశం చైతన్య నగర్‌లో జరిగింది. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ దేవరకొండ రోడ్డు నుండి మేలదుప్పలపల్లి రోడ్డు లో దేవాలయం, సెంట్ జోసెఫ్ స్కూల్, లెప్రసి హాస్పిటల్ ఉన్నందున స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని గతంలో ఆర్అండ్‌బి అధికారులకు మున్సిపల్ అధికారులకు వినతి పత్రాలు అందించామని తెలిపారు. హాస్పిటల్, దేవాలయం, స్కూలు ఉండడంతో ఎప్పుడూ జనం రద్దీతో ఉంటుందని గతంలో ప్రమాదాలు జరిగాయని గుర్తు చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం 7,8 వార్డుల శాఖ కార్యదర్శి మారగొని నగేష్,శాఖ సభ్యులు షేక్ మహబుబ్ అలీ, చింతల శోభన్,ఉంగరాల సైదులు, మారగొని యాదయ్య, మారేపల్లి సత్తయ్య,రహీమ్, శేఖర్,శివ పాల్గొన్నారు.

ఫణికెర లింగయ్య విగ్రహావిష్కరణ



నవతెలంగాణ-శాలిగౌరారం

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు నకిరేకల్ మాజీ సమితి అధ్యక్షులు ఎంసీపీఐయూ ఉమ్మడి నల్గొండ జిల్లా నాయకులు పనికెర లింగయ్య ప్రథమ వర్ధంతి, విగ్రహ ఆవిష్కరణ సభకు ముఖ్యఅతిథిగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు చామల కిరణ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం గురజాల గ్రామంలో నిరుపేద హరిజన కుటుంబంలో పనికెర పుల్లయ్య అంతమ్మ దంపతులకు 1930 మూడవ సంతానంగా లింగయ్య జన్మించాడు. రజకార్లకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో కామ్రేడ్ కామ్రేడ్ పుచ్చల పల్లి సుందరయ్య, కామ్రేడ్ భీమిరెడ్డి నరసింహారెడ్డి కామ్రేడ్ మస్జిద్ కాయల ఓంకార్ కామ్రేడ్ నంద్యాల శ్రీనివాస్ రెడ్డి కామిరెడ్డి కృష్ణమూర్తి గార్ల దళంలో కొరియర్‌గా పనిచేశారు. 1948లో జమీందారులకు జాగిర్దాలకు పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాటం చేసి బంచరాయి సీలింగ్ భూములను పేదలకు పంచడంలో కీలకపాత్ర పోషించారు. అనేక సార్లు జైలు జీవితం గడిపారు. 2000 సంవత్సరంలో నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఎంసిపిఐ అభ్యర్థిగా పోటీ చేశారు. లింగయ్యకు నలుగురు కుమారులు ఒక కుమార్తె. లింగయ్య అనారోగ్యంతో బాధపడుతూ 15.12.23న గురజాలలో మృతి చెందారు. వారి ఆశయ సాధన కోసం లింగయ్య మూడో కుమారుడు కృష్ణ కోడలు విజయనిర్మల ప్రథమ వర్ధంతి సందర్భంగా గురజాల గ్రామంలో నేషనల్ హైవే పక్కన తమ సొంత వ్యవసాయ భూమిలో 30 ఫీట్లు స్మారక విగ్రహం నిర్మించారు. విగ్రహ ఆవిష్కరణ సభకు ప్రజలు ప్రజాప్రతినిధులు వామపక్ష పార్టీల నాయకులు కవులు కళాకారులు మేధావులు, రాజకీయపార్టీల నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయండి

- **ఎమ్మెల్యే వేముల వీరేశంను కలిసిన సీపీఐ(ఎం) బృందం**

నవతెలంగాణ-నార్కట్ పల్లి

నార్కట్ పల్లి సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో వేముల వీరేశంని తన క్యాంప్ ఆఫీస్‌లో ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎస్ఆర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నార్కట్ పల్లి మండల కేంద్రంలో ఉన్నటువంటి బ్రాహ్మణ వెల్లంల ఉదయ సముద్రం ప్రాజెక్ట్ పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి కాలువ మండలంలో పెండింగ్‌లో ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఇండ్ల స్థలాలు పంపిణీ చేయాలని కోరారు. నార్కట్ పల్లిలో ఉన్నటువంటి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సొంత భవనం నిర్మించాలి 2 80 సర్వేనెంబర్ ఎల్లారెడ్డిగూడెంలో ఉన్నటువంటి దేవస్థానం భూమిని ఇల్లు లేని నిరుపేదలకు ఇండ్ల పట్టాల పంపిణీ చేయాలని ఎల్లారెడ్డిగూడెం సర్వీస్ రోడ్డు తొందరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కి వినతి పత్రం ఇచ్చారు . దీనిపైన ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కల్లూరి యాదగిరి మండల కార్యదర్శి చెరుకు పెద్దులు మండల కమిటీ సభ్యులు చింతపల్లి బయన్న, దండు రవి జాల యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.



'రాజకీయ కక్షతోనే నాపై దాడి'

నవతెలంగాణ-చింతపల్లి



చింతపల్లి గ్రామపంచాయతీ సర్పంచి ముచ్చర్ల యాదగిరితో తనకు ప్రాణహాని ఉందని, రాజకీయ కక్షతోనే తనపై దాడి చేసి గాయపరిచారని, వారిపై చట్ట పరమైన తీసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ నాయకులు ధనరాజ్ కోరారు. ఆదివారం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయన మాట్లాడుతూ బాలునాయక్ గారు గెలిచిన అహంకారంతో స్థానిక సర్పంచి ముచ్చర్ల యాదగిరి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను ఉసిగొలిపి అర్ధరాత్రి తనపై దాడి చేయించారని ఆయన ఆరోపించారు. ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ ద్వారా గత ఐదు సంవత్సరాలు లబ్ధి పొంది ఇప్పుడు ఆయన మీదనే విమర్శలు చేయడం సర్పంచి కి తగదని అన్నారు. నాపై దాడి ఉన్నేసిగాయపరచిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, నా కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలని ధనరాజు పోలీస్ శాఖ వారికి విజ్ఞప్తి చేశారు.



పేదలకోసం పరితపించిన కుర్రవిష్ణు

- **శాసనమండలి ఛైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి**
- **హాజరైన మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, జూలకంటి రంగారెడ్డి, విజయసింహారెడ్డి**

నవతెలంగాణ-మిర్యాలగూడ

పేదల కోసం పరితపించిన ప్రజా నాయకుడు కుర్ర విష్ణు అని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక టీఎస్ఆర్ గార్డెన్ లో మున్సిపల్ వైస్ ఛైర్మన్ కుర్ర కోటేశ్వరరావు అలియాస్ విష్ణు సంతాపసభ నిర్వహించారు. కురవిష్ణు చిత్రపటానికి ఆయనతోపాటు మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కరరావు, జూలకంటి రంగారెడ్డి, తిప్పన విజయసింహారెడ్డి, గుత్తా సుఖేందర్ రెడ్డి తనయుడు గుత్తా అమిత్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ తిరు నగర్ భార్గవ్ రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షులు చింత రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎన్.బి.ఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ నల్లమోతు సిద్దార్థలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విష్ణు గారి మరణం పార్టీకి తీరని లోటన్నారు. భాస్కర్ రావు మాట్లాడుతూ పార్టీకి విష్ణు అందించిన సేవలు అనిర్వచనీయమని, పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో నిబద్ధతతో పని చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా డిసిఎంఎస్ ఛైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ కుందూరు వీరకోటి రెడ్డి, మాజీ జడ్పీ ఛైర్మన్ సీడీ రవి కుమార్, జిల్లా కో ఆప్షన్ సభ్యులు మోసిన్ అలీ, మాజీ మార్కెట్ కమిటి ఛైర్మన్ చిట్టిబాబు నాయక్, మండల పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు జొన్నలగడ్డ రంగారెడ్డి, రైతు సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు నామిరెడ్డి యాదగిరి రెడ్డి, బి.ఆర్.ఎస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి పెద్ది శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, పాక్స్ ఛైర్మన్లు, పట్టణ మున్సిపల్ కౌన్సిలర్లు, ఆయా గ్రామాల సర్పంచ్లు,ఎంపిటిసి లు, బి.అర్.ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

10న సీపీఐ(ఎం) మండల కార్యదర్శుల సమావేశం

నవతెలంగాణ-నల్గొండ టౌన్

ఈనెల 10న దొడ్డి కొమరయ్య భవనంలో ఉదయం 11 గంటలకు ప్రజానాట్యమండలి కళాకారుల బాధ్యులు సీపీఐ(ఎం) మండల కార్యదర్శుల సమావేశం ఉంటుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి బాధ్యులు మండల కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

నేడు సభ్యత్వ నమోదును జయప్రదం చేయాలి : ఐద్వా

నవతెలంగాణ-మిర్యాలగూడ

మహిళా హక్కుల సాధన కోసం మహిళలో ఐక్యత పెంచేందుకు ఐద్వా ఆధ్వర్యంలో ఈనెల 8న సభ్యత నమోదు కార్యక్రమం చేపట్టినట్లు దీనిని జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షులు పోలేబొయిన వరలక్ష్మి కోరారు. ఆదివారం స్థానిక ఐద్వా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని కోరారు మహిళా అభివృద్ధికి పాలకులు పాటుపడాలన్నారు. మహిళాపై జరుగుతున్న దాడులు అత్యాచారాలను అరికట్టాలని రంగాలలో మహిళలకు ప్రాథమిక ఇవ్వాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 8న ఒకరోజు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతున్నట్లు మహిళలు అధిక సంఖ్యలో సభ్యత్వం తీసుకొని సంఘాన్ని బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం సీనియర్ నాయకురాలు గాదె పద్మ, జిల్లా నాయకులు కంచర్ల ఊర్మిళ ఓగోటి పూలమ్మ, గుంటక మహాలక్ష్మి పాల్గొన్నారు.

హమాలీ చార్జీల తగ్గింపు అన్యాయం

- **పోర్టర్స్‌ను ఆర్టీసీ ఉద్యోగులుగా గుర్తించాలి**
- **కార్గో సెంటర్ ముందు నిరసన**



నవతెలంగాణ-నల్గొండ టౌన్

నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే హమాలీ కూలి రేట్లు పెంచాల్సిన ఆర్టీసీ కార్గో హమాలి చార్జీలు తగ్గించడం అన్యాయమని తెలంగాణ ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆర్టీసీ పోర్టర్స్ హమాలి యూనియన్ డిపో గౌరవాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య అన్నారు. ఆదివారం నల్లగొండ ఆర్టిసి డిపోలోని కార్గో సెంటర్ ముందు హమాలీలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. గత 30 సంవత్సరాల పైగా బస్టాండ్లో సరుకులు పార్సల్స్ ఎగుమతి దిగుమతులు చేస్తూ జీవనోపాధి పొందు తున్నారని అన్నారు. ఆర్టీసీ గతంలో ఏఎస్ఎల్, ప్రస్తుతం కార్గో ద్వారా సరుకుల రవాణా జరిగే సందర్భంలో ఎగుమతి- దిగుమతులు చేస్తున్న హమాలీల కు సరైన కూలి రేట్లు చెల్లించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ సంస్థ సాఫ్ట్ వేర్ మార్పు చేసి కనీస పార్సల్ రేటు గతంలో పది రూపాయలు ఉన్న కూలిని ఐదు రూపాయలకు తగ్గించడం అన్యాయమని అన్నారు. గతంలో ఒక పార్సెల్ కనీస రేటు ?10 రూపాయలు ఉండి దాని బరువు పెరిగే కొద్దీ కూలి పెరుగుతుండేదని అన్నారు. ఇప్పుడు దానిని సగానికి తగ్గిస్తూ ఐదు రూపాయలు చేసి హమాలీల జీవనాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించడం సరైనది కాదని అన్నారు. కస్టమర్ సర్వీస్ ఛార్జి 20 రూపాయలు పెంచి హమాలీ కి కూలి తగ్గించడం సిగ్గుచేటు అని అన్నారు ఆర్టీసీ సంస్థ పునరాలోచన చేసి గతంలో మాదిరిగా హమాలీల రేట్లు కనీస కూలి పది రూపాయలు, బరువు పెరిగే కొద్దీ కూలి పెరిగే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు ఆర్టీసీ బస్టాండ్ కార్గో సెంటర్లో పనిచేస్తున్న పోర్టర్స్ ను ఆర్టీసీ 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించి వేతనాలు ,ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు పోలె సత్యనారాయణ, టిఎస్ఆర్టిసి కార్గో పోర్టర్స్ హమాలి వర్కర్స్ యూనియన్ డిపో నాయకులు నీల నరసింహ, కొంక అశోక్ ,కట్ట మల్లేష్ ,కట్ట నరసింహ, కొంక భిక్షం, ఏకాల శంకరయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రతిభాపోటీల్లో రాణించాలి

- **ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**



నవతెలంగాణ-మిర్యాలగూడ

విద్యార్థులు ప్రతిభ పోటీల్లో రాణించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. దశరథ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన డ్రాయింగ్ క్విజ్ పోటీల ప్రశ్న పత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పోటీ పరీక్షల్లో తమ ప్రతిభ చాటి నైపుణ్యాన్ని మెరుగుపరచుకోవాలన్నారు చిన్నప్పటి నుంచి పోటీ పరీక్షలను రాణించే విధంగా అలవాటు చేసుకోవాలన్నారు. దాని కనుగుణంగా ఉపాధ్యాయులు విద్యాబోధన అందించాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ స్వయంపాకుల విశ్వనాద్, ఎంఈఓ బాలాజీ నాయక్ కాంగ్రెస్ నాయకులు గాయం ఉపేందర్ రెడ్డి, నూకల వేణుగోపాల్ రెడ్డి, స్కైలాబ్ నాయక్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమానికి కృషి : ఎమ్మెల్యే

బీసీల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం అమరవీరుల స్థూపం వద్ద జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎన్నికైన రామకృష్ణారాజును సన్మానించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాయం ఉపేందర్ రెడ్డి, నూకల వేణుగోపాల్ రెడ్డి, స్కైలాబ్ నాయక్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు పెద్ది శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మరో కీలక ఎన్నికకు రంగం సిద్ధం..





నవతెలంగాణ-నల్గొండ టౌన్

ఇటివలే సార్వత్రిక ఎన్నికలు పూర్తి చేసుకున్న తెలంగాణ రాష్ట్రంలో మరో ఎన్నికల ప్రక్రియ మొదలైంది. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. వాస్తవానికి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల గ్రాడ్యుయేట్ కోటా ఎమ్మెల్సీగా ఎన్నికైన బీఆర్ఎస్ నేత పల్లా రాజేశ్వర్ రెడ్డి తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నియోజకవర్గంలో పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో ఆయన.. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. ఫలితంగా మండలిలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం కాస్త ఖాళీ అయ్యింది. ఈ నేపథ్యంలో ఈ నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు ఈసీ సిద్ధమైంది. ఈ క్రమంలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను ప్రారంభించాల్సిందిగా ఈసీ అధికారుకు ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే ఈ నియోజకవర్గం పరిధిలోని ఓటరు నమోదు కోసం నిర్ణీత షెడ్యూల్‌ను వెల్లడించగా ఓటర్ల నమోదు ప్రక్రియను ప్రారంభిస్తూ పబ్లిక్ నోటీస్‌ను జారీ చేసింది. ఫిబ్రవరి 6 నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాలని, ఫిబ్రవరి 24వ తేదీన ముసాయిదా ఓటరు జాబితాను వెల్లడించాలని పేర్కొంది. ఏప్రిల్ 4న తుది ఓటరు జాబితాను ప్రకటించడంతో పాటుగా ఎన్నికల నిర్వహణను ఏప్రిల్ చివరిలో గానీ, మే నెల మొదటి వారంలో నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తుంది. ఇదిలా ఉండగా.. 2021 మార్చి 14న ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు జరగగా ఆ సమయంలో మొత్తంగా 76 మంది వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీలో నిలిచారు.

ఎల్ఐసీ ఏజెంట్ సమావేశం

నవతెలంగాణ-హుజూర్‌నగర్

హుజూర్‌నగర్ పట్టణంలో ఆదివారం ఎల్ఐసీ ఏజెంట్ సంఘం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా బ్రాంచి మేనేజర్ భానుకుమార్, యు ఎస్ ఏ పోలియన్ డాలర్ టేబుల్‌కు అర్హత



సాధించిన ఏజెంట్లను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. ఎల్ఐసీ సేవలను ప్రజల్లోకి మరింత తీసుకెళ్లాలని ,ఉప యోగాలు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు విజయ శంకర్, ఆర్.కన్నయ్య, అన్నెం అంజిరెడ్డి, వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

నవతెలంగాణ-మద్దిరాల



మండలకేంద్రానికి చెందిన బీఆర్ఎస్ మండల నాయకులు వల్లపు రమేష్,పలువురు ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు.ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నూతనంగా పార్టీలోకి చేరిన వారికి మండల అధ్యక్షుడు అవిలమల్లు పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు,పచ్చిపాలవెంకన్న, విజయ్,రేసు లింగయ్య, సురేష్‌గౌడ్, మద్దెలభిక్షపతి,దగ్గులమల్లయ్య,శ్యామ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నవతెలంగాణ-తిరుమలగిరి



రాష్ట్రంలో విద్యారంగంలో దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులను కల్పించాలని, స్వచ్ఛ కార్మికులను నియమించాలని, ప్రీప్రైమరీ పాఠశాలలను ప్రాథమిక పాఠశాలలోనే నిర్వహించాలని, గ్రామంలో ఉన్న ప్రభుత్వ బడిలోనే ఆ గ్రామంలోని పిల్లలందరూ చదివేల ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని శాసనమండలి సభ్యులు అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ విస్తృత సమావేశం తిరుమలగిరి, నాగారం మండల శాఖ సౌజన్యంతో తిరుమలగిరిలోని బాలాజీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. సమావేశం జిల్లా అధ్యక్షులు ఎన్.సోమయ్య అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, లేనిచో విద్యార్థులలో శాస్త్రీయ విజ్ఞానం లోపించే అవకాశం ఉందన్నారు.నూతన గురుకుల పాఠశాలలో సొంత భవనాలను నిర్మాణం చేసి మౌలిక వస్తువుల కల్పన జరగాలని కాంట్రాక్టు ఉద్యోగుల ఉపాధ్యాయుల క్రమబద్ధీకరణ చేయాలని సూచించారు.టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సీహెచ్.రాములు మాట్లాడుతూ నిలిచిపోయిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే కల్పించాలని కేజీబీవీ ఉపాధి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి జి.నాగమణి తిరుమలగిరి మండల పరిషత్ అధ్యక్షురాలు ఎన్.స్నేహలత, నల్లగొండ జిల్లా అధ్యక్షులు వై. సైదులు, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కొలిశెట్టి యాదగిరిరావు, టీఎస్‌యూటీఎఫ్ ఆడిట్ కమిటీ రాష్ట్ర సభ్యులు యాకయ్య, శ్రీనివాసరెడ్డి,అరుణ భారతి, జిల్లా కోశాధికారి జి.వెంకటయ్య, పౌరస్పందన జిల్లా అధ్యక్షులు ఆర్ ధనమూర్తి, ఆహ్వానసంఘం అధ్యక్షులు ఎస్.సోమయ్య,కార్యదర్శి చర్లగున సమ్మయ్య, కోశాధికారి ఆర్ యాదయ్య, వెంకన్న,నాగార్జున,నాగు వెంకటాద్రి, మారయ్య, భీమయ్య, బొజ్జ నాగయ్య, పి.నాగేశ్వరరావు, సాంబయ్య, అనిల్ కుమార్, రమేష్, లాలు, ఆర్.శ్రీను, క్రాంతిప్రభ, శ్రీనివాసచారి, ఆనంద్, ఆదాం వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.



అర్హులందరికీ ఆరుగ్యారెంటీపథకాలు ఇవ్వాలి

నవతెలంగాణ-సూర్యాపేట

అర్హులైన పేదలకు కచ్చింతంగా ఆరు గ్యారెంటీ పథకాలు అందించాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు ఎల్గూరి గోవింద్ డిమాండ్ చేశారు.ఆదివారం స్థానిక సీతారాంపురంలో జరిగిన పార్టీ వన్ టౌన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.ఆరు గ్యారంటీ పథకాల కోసం రాష్ట్ర ప్రజలు ఆశలతో ఎదురు చూస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీ పథకాలతో కాంగ్రెస్ ప్రభుత్వం పట్టణాలలో పది రోజులుగా గ్రామ సభ ఏర్పాటు చేసి దరఖాస్తుల స్వీకరిస్తున్నారని , దరఖాస్తు పెట్టుకున్న ప్రతి దరఖాస్తులను పున పరిశీలించి అర్హులైన పేదలకు ఆ పథకాన్ని అందించాలని కోరారు. రేషన్ కార్డు లేని వారికి తక్షణం రేషన్ కార్డులు అందించి వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.పట్టణ నాయకులు వల్లపు దాసు సాయికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పట్టణ కమిటీ సభ్యులు మామిడి సుందరయ్య,షేక్ సైదులు, అర్వపల్లి లింగయ్య,షేక్ జహంగీర్,మామిడి పుల్లయ్య, శశిరేఖ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-హుజూర్‌నగర్

అసంఘటిత రంగంలోని కార్మికులు లేబర్ వెల్ఫేర్ బోర్డు ద్వారా నిర్వహించే ఉచిత వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గం అధ్యక్షుడు షేక్ సైదా కోరారు.ఆదివారం పట్టణంలోని నందు మునిసిపాలిటీ పరిధిలోని భవన నిర్మాణ కార్మికులు ఆ సంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులు తెలంగాణ లేబర్ బోర్డు ద్వారా నిర్వహించిన ఉచిత వైద్య పరీక్షలలో ఆయన పాల్గొని మాట్లాడారు.కార్మికులు వెల్ఫేర్ బోర్డు కార్డు తప్పక తీసుకోవాలన్నారు దీనివల్ల వారికి ఉన్న ఉపయోగాలను ఆయన వివరించారు.మెడికల్ క్యాంపు కోఆర్డినేటర్ జెల్ల తారకరత్న,బి.సురేష్, ఎం.శ్రీనివాసరావు సిబ్బందితో పరీక్షలు నిర్వహించారు.రక్త, మూత్ర, వంద రకాల పరీక్షలతో పాటు గుండె ఊపిరితిత్తులు,కళ్లు, వినికిడి వంటి పరీక్షలను ఉచితంగా చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీల సంఘం డివిజన్ అధ్యక్షుడు ఎస్.కె మన్సూర్ అలీ, గౌడ సంఘం అధ్యక్షుడు వల్లపుదాసు కృష్ణ,భవననిర్మాణకార్మిక సంఘం అధ్యక్షుడు బంక శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి వినాయకరావు, కోశాధికారి ఏలియా, పెద్దబ్బాయి, అయితగాని నర్సింహారావు,మన్నెం సైదులు, నరేష్, శ్రీను, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



ఎన్ఎస్‌యూఐ నాయకులకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలి

నవతెలంగాణ-నూతనకల్

9ఏండ్లుగా అధికారంలో లేకున్నా కాంగ్రెస్ బలోపేతానికి కష్టనష్టాలు ఎదుర్కొని అహర్నిశలు కృషి చేశామని నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎన్ఎస్‌యూఐ నాయకులకు నామినేటెడ్ పదవులు కల్పించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు ఉప్పుల మురళి కోరారు.ఆదివారం మండలకేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు.బీఆర్ఎస్ ప్రభుత్వం అరాచకాలు,ఆగడాలు తట్టుకొని,ఎన్నో తపుడు కేసులు బనాయించిన కానీ వాటిని ఎదుర్కొని కాంగ్రెస్ జెండా మోసిన ఎన్ఎస్‌యూఐ నాయకులకు రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు రాష్ట్ర ప్రభుత్వ నామినేటెడ్ పదవిలో యువతకు సముచితమైన స్థానం కల్పించి యువతను ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల కోఆర్డినేటర్ మరికంటి అశోక్, ముత్యంప్రసాద్, లింగంపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు పంతం సాయి,గుండాలప్రశాంత్, బొడ్డుపల్లిసందీప్,మడ్డిశ్రావణ్, మణికుమార్, గోపి,మహేష్,సాయి,వేణు, ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రజావాణి యథావిధిగా కొనసాగుతుంది

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్

జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమం ముగియడంతో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం కలెక్టరేట్‌లో యథావిధిగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజలు ఈ విషయాన్ని గమనించి ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజాపాలన దరఖాస్తుల నమోదు ప్రక్రియ వేగం పెంచాలి

- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్

ప్రజాపాలన దరఖాస్తుల ఆన్లైన్ ప్రక్రియలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్.ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో ప్రజాపాలనుకు సంబంధించి ఆదివారం రెండో రోజున నియోజక వర్గాలలోని మండలాలకు సంబంధించి జీపీలు అలాగే ఐదు మున్సిపాలిటీలకు సంబంధించి ఆన్లైన్ నమోదు ప్రక్రియ సంబంధిత కేంద్రాలలో శరవేగంగా ప్రత్యేక అధికారులు, వార్డు ఇన్‌చార్జిల సమక్షంలో డేటా ఎంట్రీ జరుగుతుందని తెలిపారు.ఆదివారం సాయంత్రం 6.00 వరకు 83322 దరఖాస్తులను ఆన్‌లైన్ డేటా ఎంట్రీ చేయడం జరిగిందని నిర్దేశించిన సమయానికి నిరంతర ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.



12న చలో పార్లమెంట్‌ను జయప్రదం చేయండి

నవతెలంగాణ-చివ్వెంల

దేశంలో విద్యారంగ పరిరక్షణకు విద్యారంగాన్ని కాపాడాలని, నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని అందరికీ విద్య ఉపాధి కల్పించాలని జాతీయ స్థాయి మెడికల్ టెస్ట్ నీట్ రద్దు చేయాలని జనవరి 12న దేశవ్యాప్తంగా 16 విద్యార్థి సంఘాలను కలుపుకొని చలో పార్లమెంట్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, దీనిని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బానోతు వినోద్‌కుమార్ కోరారు.మండలకేంద్రంలో ఆ సంఘం ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు.పసివయస్సులోనే విద్యార్థుల పాఠ్యపుస్తకాల్లో మతోన్మాద భావజాలాలను జొప్పిస్తూ విద్యారంగాన్ని కాషాయీకరణ చేస్తున్నారని విమర్శించారు.విద్యార్థుల పాఠ్యపుస్తకాలలో జాతీయ ఉద్యమ నాయకుల చరిత్రను తొలగించి జాతీయ ఉద్యమంతో సంబంధంలేని గాడ్సే , వీడి సావర్కర్ చరిత్రలను పొందపరుస్తున్నారని, జ్యోతిష్యం వాస్తు వంటి అశాస్త్రీయ భావజాలాలని విద్యార్థుల మెదడులో ఎక్కిస్తూ మొద్దు పరుస్తున్నారని తెలిపారు.ఎన్ఎన్‌టీఏ వంటి సంస్థలను రద్దు చేయాలని జాతీయస్థాయి పోటీ పరీక్షలను ఈ సంస్థ ద్వారా నిర్మించడం ద్వారా విపరీత అధికార కేంద్రీకృతమై విద్యార్థులకు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నాగ, మనోహర్, శ్రీను, సుమన్, విగ్నేష్, గోపి, అభి, ప్రేమ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటికి అక్షింతలు వితరణ చేసిన సర్పంచ్

నవతెలంగాణ-నూతనకల్

శ్రీరామ జన్మభూమి అయోధ్యలో పూజలు నిర్వహించిన అక్షింతలు ఆదివారం మండల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామ సర్పంచ్ గుర్రం సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఇంటింటికి వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గాడుదుల రజిత లింగరాజు, వార్డు సభ్యులు శీలం నారాయణ,నారగాని యాక స్వామి,గౌడ చర్ల లింగయ్య,నాయకులు జలగం యోగానందం,లింగాల రామచంద్రయ్య,లింగాల వెంకన్న,పసుల రవి యాదవ్, పసుల లింగయ్య,పసుల అవిలయ్య,అనంతుల నాగలింగం,కోడి మల్లయ్య, ఇంజమూరి అప్పయ్య పురోహితులు ఆమంచి ఉపేందర్,నారగాని రాజేష్, అనంతుల సత్తయ్య,గుండా భరత్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మందులసామేలుకు మంత్రి పదవి కేటాయించాలి

నవతెలంగాణ-తుంగతుర్తి

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి,మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం అహర్నిశలు కష్టపడిన శాసనసభ్యులు మందులసామేలుకు మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ మండల దళిత నాయకులు పోలేపాక అంజయ్య కోరారు.ఆదివారం మండలకేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు.ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 50వేల రూపాయల నగదు లేకపోయినా 52,000 ఓట్ల మెజార్టీతో గెలిచిన మందుల సామేలుకు మంత్రి వర్గంలో చోటు కల్పించాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక మాదిగ సామాజిక వర్గం ఉన్న తుంగతుర్తి నియోజకవర్గంలో ఆయన భారీ మెజార్టీతో గెలిచారని గుర్తు చేశారు.ఆయనకు మంత్రి పదవి ఇస్తే మాదిగ జాతికి న్యాయం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు చింతకుంట్లవిఠల్, చెడుపాక శ్రావణ్‌కుమార్,పోలేపాకసతీష్,బొంకూరిరంజిత్,మరికంటిఅశోక్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయ ఆరంభం రోజు సెలవు ఇవ్వాలి

నవతెలంగాణ-చివ్వేంల

శ్రీరామ జన్మభూమి అయోధ్యలో ఆలయ నిర్మాణం పూర్తయి ప్రారంభమవుతున్న సందర్భంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆ రోజున సెలవుదినంగా ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర పూర్వాధ్యక్షులు తీకుల్ల సాయిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. భారతదేశంలోనే అత్యంత కీలకమైన రామాలయం వందల సంవత్సరాల పోరాటం ఫలితంగా నిర్మాణం పూర్తి అయి అక్కడ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జాతీయస్థాయిలో జరుగుతుందని,ఈ కార్యక్రమం జాతి గర్వించదగ్గ సందర్భమని అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ రోజును సెలవు దినంగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.

డబ్బులు ఇప్పించండి మహాప్రభో..

నవతెలంగాణ-తిరుమలగిరి



నా డబ్బులు నాకు ఇప్పించండంటూ తిరుమలగిరి మున్సిపాలిటీ 5వ వార్డుకు చెందిన పోతరాజు శ్రీనివాస్ తండ్రి చంద్రయ్య కోరారు.ఆదివారం ఆయన మాట్లాడుతూ దళితబంధు పథకంలో తనకు అన్యాయం జరిగిందని దళితబంధు పథకంలో నేను షాప్ పెట్టుకోగా 5వ వార్డుకు చెందిన పెద్ద నాయకుడు ప్రజాప్రతినిధి కొటేషన్ మార్చుచేసి రూ.3.10లక్షలు తక్కువగా ఇచ్చారన్నారు.అది కూడా రెండు నెలలు వారి చుట్టూ తిప్పించుకుని ఇచ్చారన్నారు. ఇంత తక్కువ ఎందుకు ఇచ్చారని అడిగితే జీఎస్టీ కట్ అయ్యిందని చెప్పారన్నారు.వారికి ఫోన్ చేసిన మరుసటి రోజు ఫోన్ చేసి ఉదయం 7 గంటలకు 50,000 రూపాయలు ఇస్తేనే దళితబంధు సాంక్షన్ చేపిస్తా ననడంతో నేను ..నా భార్య బంగారం కుదవబెట్టి రూ.40 వేలిచ్చాననాని ఆరోపించారు.అయినా కూడా రూ.3.10,000 లక్షలకు తక్కువగా ఇచ్చారన్నారు.ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయగలరని కోరారు.

దాబా నిర్వాహకుల మధ్య ఘర్షణ

- తలలు పగలగొట్టుకున్న వైనం
- భయభ్రాంతులకు గురైన పట్టణవాసులు

నవతెలంగాణ-కోదాడరూరల్



పక్కపక్కనే ధాబా నిర్వాహకుల మధ్య అర్ధరాత్రి దాటిన తర్వాత ఘర్షణ చోటుచేసుకున్న ఘటన పట్టణంలోని హుజుర్‌నగర్‌రోడ్డులో శనివారం రాత్రి చోటుచేసుకుంది.వివరాల్లోకెళ్తే..దాబాలో వంటమాస్టార్ కూతురు పుట్టినరోజు వేడుకకు మరో దాబాలో పనిచేస్తున్న వంట మాస్టర్‌నుపిలవడంతో ఆగ్రహించిన మరో దాబా యజమాని దాడి చేశాడు.ఇరువర్గాలు బీరుసీసాలు, కర్రలతో దాడి చేసుకోవడంతో ఇరువర్గాలవారికి తీవ్రగాయాలు కాగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. కర్రలతో దాడులు చేసుకోవడంతో తలలు కూడా పగిలాయి. వారిని వైద్య చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాల తరలించారు.అర్ధరాత్రి కర్రలతో దాడులు చేసుకోవడంతో పట్టణవాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు.అర్ధరాత్రి సమయం వరకు దాబాలలో మద్యం విక్రయిస్తూ సమయపాలన పాటించకపోవడంతో ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నా పోలీసులు పట్టించుకోడంలేదని సామాజిక కార్యకర్తలు, పట్టణవాసులు ఆగ్రహిస్తున్నారు.

దాబాలతో ప్రభుత్వ ఆదాయానికి గండి...

పట్టణంలో ఇబ్బడిముబ్బడిగా దాబాలు వెలుస్తున్నాయి చాటుమాటున మద్యం నడిపిస్తూన్నారు. దీంతో పట్టణంలోని బార్లు గిరాకీలు లేక మూసివేయాల్సిన పరిస్థితి దాపురించింది.బార్లు మూతపడడంతో దీంతో ప్రభుత్వానికి భారీగా ఆదాయానికి గండి పడిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. వీరిచ్చే మామూళ్లకు పోలీసులు కక్కుర్తి పడి పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో వీళ్ల ఆగడాలు మితిమీరి పోయాయి. అడ్డు వచ్చిన వారిపై దాడులకు కూడా దిగుతారు.రంగురంగుల లైట్లు జిగేల్ జిగేల్ మనిపించే వెలుగులతో గుడిసెలు ఏర్పాటు చేసి వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు.ఫ్యామిలీ దాబా అని పేరు పెట్టడంతో కుటుంబ సమేతంగా ఆ దాబాలకు వెళ్లడంతో అక్కడ మద్యం సేవిస్తూ గొడవలు పడే వారిని చూసి వెను దిరిగిన సందర్భాలు కోకొల్లలు ఉన్నాయని పలువు అభిప్రాయపడుతున్నారు.ఈ దాబాలలో ఎప్పుడు ఏదో ఒక గొడవ జరుగుతూనే ఉంటుంది.అంతా తెలిసినాఏమీ పట్టనట్టుగా అధికారులు ఇప్పటికైనా స్పందించి పుట్టగొడుగుల వెలుస్తున్న దాబాలపై దాడులు జరిపి చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
యాదాద్రి భువనగిరి
సోమవారం | జనవరి 08. 2024 | www.navatelangana.com

సీపీఐ(ఎం) రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-గుండాల

ఈ నెల 9,10వ తేదీలలో చౌటుప్పల్ పట్టణకేంద్రంలో నిర్వహించనున్న సీపీఐ(ఎం) జిల్లా స్థాయి నాయకత్వ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి అన్నారు.ఆదివారం ఆయన మోత్కూరులో పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ రెండు రోజులు జరిగే ఈ శిక్షణా తరగతుల్లో మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమీక్ష, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించడంతో పాటు ప్రస్తుత రాజకీయ పరిణామాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా పార్టీ నాయకత్వంలో రాజకీయ,సైద్ధాంతిక స్థాయిని నిర్మాణ పని పద్ధతులను మెరుగు పరిచే విధంగా భవిష్యత్ కర్తవ్యాలను రూపొందిస్తామన్నారు.నిర్ణయించిన డెలిగేట్స్ సకాలంలో హాజరు కావాలని కోరారు.ఈకార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు,జిల్లా కమిటి సభ్యులు రాచకొండ రాములమ్మ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు మండలకేంద్రంలో ఆదివారం 1999-2000 సంవత్సరపు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం దినేష్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఒకరికొకరు పరిచయాలు చేసుకొని చిన్ననాటి పాత జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. అనంతరం చదువు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈకార్యక్రమంలో హరగోపాల్ బాబురావు, హనుమంత్‌రెడ్డి, రమాదేవి, పగడాల శ్రీనివాస్, కూళ్ల సిద్దులు, బీజని బాలరాజు, కొరుటూరు ఉపేందర్, యేలుగుల శివ, దుడల ప్రవీణ్, సుధారాణి, క్రాంతి, సాగర్ దూడల, ప్రవీణ్ ,జూకంటి సిద్దులు, ఇక్కిరి శ్రీనివాస్, బబ్బురి కృష్ణ, ఎండి మహబూబ్, కుమార్, లక్కాకుల శీను, అంబాల మహేందర్, లక్ష్మీనారాయణ, ప్రశాంత్, భాస్కర్, రాజు, భవిత, వసంత, అమరావతి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

దడిపల్లి లచ్చయ్యకు సీపీఐ(ఎం) ఘననివాళి

- అమరుల త్యాగాలు మరువద్దు
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండిజహంగీర్



నవతెలంగాణ-గుండాల

మండలంలోని పాలడుగు గ్రామ సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు దడిపల్లి లచ్చయ్య అనారోగ్యంతో మరణించడంతో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జాహంగీర్ మృతుని మృతదేహంపై ఎర్రజెండా కప్పి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు భూమికోసం, బుక్తికోసం, పేద ప్రజల బానిసత్వ విముక్తి కొరకు ఎంతో మంది కమ్యూనిస్ట్ నాయకులు ప్రాణత్యాగాలు చేశారని, వారిత్యాగాలను మరువొద్దన్నారు. వారి త్యాగాలు, ఆశయాలను నేటి యువత ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ప్రజలతో ఎన్నుకోబడిన అప్పటి నాయకులు ప్రజలమధ్యన ఉంటూ ప్రజల కోసం ప్రజా సమస్యల కోసం వారి జీవితాలను అంకితం చేశారన్నారు.నేటి రాజకీయ నాయకులు అవకాశవాద,స్వార్థ ప్రయోజనాలే తప్ప,ప్రజల పట్ల,ప్రజాసమస్యలపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు,జిల్లా కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి, సిర్పంగి స్వామి,మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు,మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, శాఖ కార్యదర్శి పిట్టల చంద్రయ్య, దడిపల్లి సుదర్శన్,కొంపల్లి గంగయ్య,చింతకింది సోమరాజు, వడ్డేపల్లి లక్ష్మణ్,వెండి యాదగిరి, దడిపల్లి సైదులు,యాస నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

9,10వ తేదీల్లో సీపీఐ(ఎం) జిల్లాస్థాయి రాజకీయ శిక్షణా తరగతులు



నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఈనెల 9,10వ తేదీల్లో చౌటుప్పల్ పట్టణంలో జరిగే సీపీఐ(ఎం) జిల్లాస్థాయి రాజకీయ శిక్షణా తరగతులు జయ ప్రదం చేయలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎంఏ ఇక్బాల్ తెలిపారు. ఆలేరు పట్టణంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం పదేండ్లుగా కార్పొరేట్ అనుకూల ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని విమర్శించారు. దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతుందన్నారు. దోపిడీ నుండి ప్రజల దృష్టిని మరల్చేందుకు దేశంలోని ప్రజల మధ్య మతవిద్వేషాలు రెచ్చగొడు తుందన్నారు. గడిచిన 10 సంవత్సరాల కాలంలో దేశ సంపద కరిగిపోయిందని పేర్కొన్నారు.రూ. లక్షల కోట్లు అప్పు చేసినప్పటికీ ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ప్రజలపై వివిధ రకాల వస్తువులపై రకరకాల పన్నులు మోపిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మొరిగాడి రమేష్, ఘనగాని మల్లేష్, తాళ్లపల్లి గణేష్, చెన్నరాజేష్, భువనగిరి గణేష్, వడ్డెమాను విప్లవ్, కాసులనరేష్ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-అడ్డగూడూర్

మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద 2024 నూతన సంవత్సరం నవతెలంగాణ క్యాలెండర్ ను ఆదివారం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు పూల పెళ్లి సోమిరెడ్డి , మాజీ సర్పంచ్ గోలి రాంరెడ్డి , గూడెపు పాండు, కడారి రమేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మారిశెట్టి మల్లేష్ , రామ్ రెడ్డి , నాగులపల్లి రమేష్, ఉపేందర్, మంటిపల్లి సతీష్, బీరెల్లి నరసయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.



కర్నాటకమంత్రికి స్వాగతం పలికిన భువనగిరి ఎమ్మెల్యే

నవతెలంగాణ-భువనగిరిరూరల్

కర్నాటక మైనర్ ఇరిగేషన్ & సైన్స్ టెక్నాలజీ శాఖ మంత్రి ఎన్ ఎస్ బోసు రాజు ఆలేరు మండ లంలోని కొలనుపాక సోమేశ్వర స్వామి దేవస్థానానికి వెళ్తుండగా భువనగిరిలో హోటల్ వివేరా వద్ద భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి వారికి మర్యాద పూర్వకంగా స్వాగతం పలికి, పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ డెలిగేట్ మెంబర్ తంగళ్ళపల్లి రవికుమార్, వడిచెర్ల కృష్ణ యాదవ్, పట్టణ అధ్యక్షులు కూర వెంకటేష్, నాయకులు రఫీ యుద్దీన్, నల్గొండ ఎంపీపీ నూతి రమేష్‌రాజు, పిట్టల బాలరాజు, మాజీ మున్సిపల్ చైర్మెన్ బర్రె జహంగీర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సైద్ధాంతిక రాజకీయ చైతన్యం పెంపొందించుకోవాలి



నవతెలంగాణ-రామన్నపేట

రాజకీయ నాయకులు నాయకత్వం, సైద్ధాంతిక రాజకీయ చైతన్యం పెంపొందించుకోవాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం సూచించారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9,10వ తేదీల్లో చౌటుప్పల్ పట్టణంలో నిర్వహించ పార్టీ నాయకత్వ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని కోరారు. ప్రజా సమస్యలపై అధ్యయనం చేసి మరిన్ని పోరాటాలకు రూపకల్పన చేసేందుకు నాయకత్వంలో సైద్ధాంతిక రాజకీయ చైతన్యం పెంపొందించేందుకు రాజకీయ శిక్షణా తరగతులు తోడ్పడుతాయన్నారు.ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మామిడి వెంకట్ రెడ్డి, గాదె నరేందర్, నాగటి ఉపేందర్, బావండ్లపల్లి బాలరాజు, పిట్టల శ్రీనివాస్, మేడి గణేష్, అప్పం సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీబీనగర్ : ఈనెల 9 10 తేదీల్లో చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని జై శ్రీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే సీపీఐ(ఎం) రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలోని బ్రాహ్మణపల్లి కుదలి వద్ద పార్టీ నాయకులతో కలిసి రాజకీయ శిక్షణ తరగతుల కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మాజీ మండల కార్యదర్శి బండారు శ్రీరాములు, కార్యాలయం సభ్యులు ప్రాంతం, వెంకటేష్, ఆడపల్లి జంగయ్య, లింగాల బాలయ్య, కంసాని వినోద్ కుమార్, జేర్పుల కీమా, మేగోటి భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

రంభపురి జగద్గురువుల 68వ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-ఆలేరుటౌన్

శ్రీమద్ రంభాపురి జగద్గురువుల 68వ జన్మదినోత్సవ వేడుకలు ఆదివారం ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హాజరయ్యారు. శ్రీ ఈశ్వర్ ఖండ్రే కర్నాటక ప్రభుత్వ అటవీశాఖ మంత్రి, భువనగిరి ఏమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలకు హాజరై శుభాకాంక్షలు తెలిపారు.ఆలయ అభివృద్ధికి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు.కొలనుపాక ప్రాంతాన్ని, ఆలయాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు.ఇక్కడ ఆలయాలు అభివృద్ధి జరిగితే స్థానిక ప్రజలకు ఉపాధి కలుగుతుందని ఆ దేవుడి ఆశీర్వాదం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంధ మల్ల అశోక్, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-చౌటుప్పల్



చౌటుప్పల్ పట్టణకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04 విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వ హించారు. విద్య నేర్పిన గురువులను పూల మాలలు, శాలువాలు, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేస్తూ స్నేహితులతో ఆడిపాడారు. ఈ కార్యక్ర మంలో ఉపా ధ్యా యులు బి. నర్సింహారెడ్డి, జీ.వెంక టేశ్వర్లు, పాండురంగవిఠల్, ప్రసాద్, అరుణకుమారి, సత్తిరెడ్డి, బాలనర్సింహా, విద్యార్థులు పాల్గొన్నారు.

వైన్స్‌చోరీ కేసు చేధించడంలో పోలీసుల కృషి అభినందనీయం



నవతెలంగాణ-రాజపేట

రాజపేట మండల పరిధిలోని పొట్టి మర్రి చౌరస్తాలో గల వైన్స్ లో గత రెండు రోజుల క్రితం జరిగిన చోరీ కేసులో దుండగులను గుర్తించడంలో పోలీసుల కృషిని అభినందిస్తూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ కు వెళ్లి పోలీసు బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బీసీ నేత జూకంటి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ సంఘటన జరిగిన 24 గంటల్లోనే యాదాద్రి డివిజన్ ఏసీపీ శివరాంరెడ్డి పర్యవేక్షణలో సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్సై సుధాకర్‌రెడ్డి నేతృత్వంలో వేగవంతంగా దర్యాప్తు చేసి అంతర్రాష్ట్ర ముఠాను పట్టుకోవడం అభినందించదగ్గ పరిణామమన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నేర రహిత సమాజ నిర్మాణం కోసం పోలీసులు కృషి చేయాలని కోరారు.అదేవిధంగా సైబర్‌నేరాల పట్ల, గంజాయి మాఫియా పట్ల పోలీసు యంత్రాంగం ఉక్కుపాదం మోపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఐరేని నవీన్, బీఆర్ఎస్ మండల నాయకులు భూపతి బాలరాజు, యువజన కాంగ్రెస్ నాయకులు మారోజు వెంకటేష్, గుర్రం రూపేష్, భూక్యా మధు తదితరులు పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ పరీక్షలు

నవతెలంగాణ-ఆలేరుటౌన్

స్వామి వివేకానంద జయంతి ఉత్సావాలలో భాగంగా జనని స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆలేరు పట్టణ కేంద్రం లోని వీఆర్ కాలేజీలో ఆదివారం 10వ తరగతి విద్యార్థుల టాలెంట్ టెస్ట్ పరీక్షలు నిర్వహించారు. టాలెంట్ టెస్ట్ పరీక్షకు ఆలేరు పట్టణ పరిధిలోని వివిధ స్కూళ్లనుండి 100 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు నిర్వాహ కులు తెలిపారు. ఇందిరా ప్రియదర్శిని



అవార్డు గ్రహీత డాక్టర్ తిరునగరి శ్రీనివాసు, కళాశాల విఆర్ కళాశాల ప్రిన్సిపాల్ నాలం అయ్యప్ప విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. టాలెంట్ టెస్ట్ పరీక్షలు విద్యార్థులకు భవిష్యత్‌కు ఉపయోగపడతాయన్నారు. ఆత్మస్థైర్యాన్ని పెంచుతాయన్నారు. ఈ కార్యక్రమంలో టాలెంట్ టెస్ట్ కన్వీనర్ కమలాకర్ , సంస్థ ఫౌండర్ మైదంభాస్కర్, సంస్థ ప్రెసిడెంట్ పెరపు ఆనందు, సంస్థ ప్రతినిధులు చందు, మద్దూరి శ్రీకాంత్, జూకంటి సంపత్, ఆలేటి శ్రీకాంత్, మద్దూరి శ్రీకాంత్ పాల్గొన్నారు.

సీతారాముల అక్షింతలు గడపగడపకు పంపిణీ

నవతెలంగాణ-ఆలేరుటౌన్



ఆలేరు పట్టణం, మండలంలోని పలు గ్రామాలలో అయోధ్య శ్రీ సీతారాముల అక్షింతలు ఆదివారం గడప గడపకు పంపిణీ చేశారు. ఆలేరు మండలం మంతపురి గ్రామంలో ప్రజలు అందరూ భక్తి శ్రద్ధలతో అక్షింతలను హారతిపట్టి సాగరంగ ఆహ్వానించి వారి వారి ఇండ్లల్లోకి తీసుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బండారి ప్రసాద్, పేరపు సిద్దులు, కొరుటూరి ప్రశాంత్, పల్లె రంజిత్, అమలేశ్వర్, దంతూరి శ్రీను, పరశురామ్, లోడే రాజు, ప్రవీణ్, ఉమేష్, రాజు, శ్రీకాంత్, శ్రీను, కమలాకర్, మహేష్, సంపత్, సిద్దులు తదితరులు పాల్గొన్నారు.

నగర సంకీర్తన

నవతెలంగాణ-రాజపేట

అయోధ్యలో ఈనెల 22వ, తేదీన శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా రాజపేట మండల కేంద్రంలో ఆదివారం నగర సంకీర్తన నిర్వహించారు. ఏకాదశి పర్వదినం సందర్భంగా రాజపేటలో ప్రధాన వీధుల గుండా శ్రీరామ జయరామ జయజయ రామ అంటూ నగర సంకీర్తన చేపట్టారు. శ్రీ రామకృష్ణ సాయి మందిరం నుండి సంకీర్తన ప్రారంభమైంది.ఆలయ అర్చకస్వాములు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కటకం లక్ష్మణ్, బల్ల దామోదర్, ఆడెపు శేఖర్, నాల్ల శేఖర్, బెజగం చంద్రశేఖర్, నంగునూరు రాజు, కటకం లక్ష్మణ్, నంగునూరు సోమయ్య, పెద్ది సంతోష్, కూనూరు బిక్షపతి, ఉప్పల రమేష్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా రాజపేటలోని ఆలయాల్లో శ్రీరామ నామ సంకీర్తనతో పూజలు చేశారు.

చౌటుప్పల్ పట్టణ గౌడ సంఘం అధ్యక్షునిగా చింతకింది అంజయ్యగౌడ్



నవతెలంగాణ-చౌటుప్పల్

చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని గౌడ సంఘం కార్యాలయంలో సంఘం మాజీ అధ్యక్షులు బత్తుల లక్ష్మయ్యగౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం సంఘం సమావేశం నిర్వహించారు. అనంతరం గౌడసంఘం పట్టణ నూతనకమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా చింతకింది అంజయ్యగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షునిగా చెవగోని వెంకటేశ్‌గౌడ్, ఉడుగు శ్రీనివాస్‌గౌడ్, ప్రధానకార్యదర్శిగా తొర్పునూరి వెంకటేశ్‌గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బత్తుల శ్రీశైలంగౌడ్, సహాయకార్యదర్శిగా మునుకుంట్ల సత్యనారాయణగౌడ్, తొర్పునూరి బాబుగౌడ్, కోశాధికారిగా ఉప్కాగుల రమేశ్‌గౌడ్, ప్రచారకార్యదర్శిగా ఉడుగు మల్లేశ్‌గౌడ్, సాంస్కృతిక కార్యదర్శిగా వరగంటి మహేందర్‌గౌడ్, సంయుక్త కార్యదర్శిగా చెరుకు లింగస్వామిగౌడ్, సభ్యులుగా తొర్పునూరి మల్లేశ్‌గౌడ్, రాజపేట అశోక్‌గౌడ్, పేరేపల్లి స్వామిగౌడ్, బొడిగె బాలకృష్ణగౌడ్, వర్కాల పాండుగౌడ్, తొర్పునూరి శ్రీనుగౌడ్, మరికొంతమంది సభ్యులుగా ఎన్నికయ్యారు.



క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-రాజపేట

రాజపేటలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో ఆదివారం మర్కుక్ శ్రీ పాండురం గ(శ్రమం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అదరాసుపల్లి శ్రీధర శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకస్వాములు చలివేదుల వెంకటరామకృష్ణ ప్రసాద్‌శర్మ బల్లదామోదర్, బిర్రు శ్రీనివాసులు, కటకం లక్ష్మణ్, నంగునూరు రాజు, నంగునూరు సోమయ్య, పెద్దిసంతోష్, బెజిగం చంద్రశేఖర్, కోనూరు భిక్షపతి, ఉప్పల రమేష్, ఆడెపు శేఖర్ తదితరులున్నారు.

సీనియర్ కాంగ్రెస్ నాయకులు మృతి



నవతెలంగాణ-రాజపేట

రాజపేట మండలంలోని పారుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొమ్మగాని రాజయ్య (80) ఆదివారం మృతి చెందారు. వారి పరమార్శించి ఆయన పార్థివ దేహానికి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జెండా కప్పి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్ గౌడ్, ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాపోలు లక్ష్మారెడ్డి, బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్ కుమార్, గ్రామ శాఖ అధ్యక్షులు బాల మల్లేశం, జిల్లా కాంగ్రెస్ నాయకులు భూపతి యాదగిరి,సీతాల వీరయ్య, గౌర బక్కయ్య పాల్గొన్నారు వీరు పేర్లు కూడా యాడ్ చేయగలరు జూకంటి వీరయ్య, నర్సింలు, కపిల్, తదితరులు పాల్గొన్నారు.

మూసీ జలాలను శుద్ధి చేయిస్తాం

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

నవతెలంగాణ-చౌటుప్పల్‌రూరల్

మూసీజలాలను శుద్ధి చేయిస్తామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలం స్వాములవారి లింగోటం వద్ద పిలాయి పల్లి కాల్వను ఆదివారం ఎమ్మెల్యే పరిశీలించారు. పరిశ్రమల నుండి కాలుష్యం విపరీతంగా పెరిగిపోవడంతో పిల్లాయిపల్లి కాలువలో నీరు కాలుష్యం అయిందని రైతులు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డితో ఆవేదన వ్యక్తం చేశారు. పిలాయిపల్లి కాలువను శుద్ధి చేయించి రైతులకు సాగునీరు అందిస్తానని ఎమ్మెల్యే రైతులకు హామీ ఇచ్చారు. అనంతరం చౌటుప్పల్ మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి, జెడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ ఉప్పు భద్రయ్య, పీఏసీఎస్‌ఉపాధ్యక్షులు చెన్నగోని అంజయ్యగౌడ్, బ్లాక్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, బోయ దేవేందర్, నాయకులు బక్క శ్రీనాథ్, వీరమల్ల సత్తయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



స్థానిక సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు

నవతెలంగాణ-యాదగిరిగుట్ట



స్థానిక సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు ఉధృతం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మంగ నర్సింహులు కోరారు. ఆదివారం యాదగిరిగుట్ట పట్టణ కమిటీ సమావేశం ఎసకె లతీఫ్ అధ్యక్షతన నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదగి రిగుట్ట పట్టణంలో అనేక రకాల సమస్యలు పేరుకుపోయాయన్నారు. యాదాద్రిఆలయానికి వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు సౌకర్యాలు సక్రమంగా లేకపోవడం మూలంగా ఇబ్బందుల పాలవుతున్నారన్నారు. ఈ నెల9,10వ తేదీల్లో చౌటుప్పల్‌లో జరిగే రాజకీయ శిక్షణా తరగతులు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బబ్బూరి పోశెట్టి పట్టణ కార్యదర్శి నూకల భాస్కర్‌రెడ్డి, ఎస్‌కె .ఉస్మాన్‌షరీఫ్, నల్ల మల్లయ్య బండిరెడ్డి ఈశ్వర్‌రెడ్డి, దుడుక నాగమణి, పాల్గొన్నారు.

నవతెలంగాణ
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
సోమవారం | జనవరి 08, 2024 | www.navatelangana.com

చేతి వృత్తిదారులంతా ఐక్యంగా ఉండాలి



నవతెలంగాణ-చిట్యాల టౌన్

చేతి వృత్తిదారులంతా ఐక్యంగా ఉన్నప్పుడే వారి సమస్యలు పరిష్కారం అవుతాయని చిట్యాల మాజీ సర్పంచ్ జిట్ట నగేష్ అన్నారు. చిట్యాల మండల కేంద్రంలో ఆదివారం తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్లను వివిధ వృత్తిదారులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం జిల్లా కార్యదర్శి అవిశెట్టి శంకరయ్య, రజకవృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు ఐతరాజు యాదయ్య, అక్కెనపల్లి నాగయ్య, నలపరాజు శేఖర్ ,తీగల కృష్ణయ్య, అమరోజు రాములు, వెలిమినేటి అంజయ్య, నలపరాజు సైదులు, ఐతరాజు శంకర్, సైదులు పాల్గొన్నారు.

గురుకులాల దరఖాస్తు గడువు పొడిగింపు

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్



జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, గురుకులాలలో విద్యా సంవత్సరం 2024-25కు సంబంధించి 5వ తరగతిలో ప్రవేశం కోసం గతంలో ప్రకటించిన గడువు తేదీని ఈనెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు సాంఘిక సంక్షేమ రీజినల్ కోఆర్డినేటర్ హెచ్ అరుణ కుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఫిబ్రవరి 11వ తేదీన ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రవేశపరీక్ష ఉంటుందని తెలిపారు. విద్యార్థులు అర్హతలను పరిశీలించుకుని tswreis.ac.in ద్వారా ఒక ఫోన్ నెంబర్‌తో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, 2023-24 విద్యా సంవత్సరంలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

దైద రవీందర్‌కు నామినేటెడ్ పదవి దక్కేనా.. ?

- నాలుగున్నరేండ్లుగా కార్యకర్తలకు పెద్దదిక్కుగా
- ఎమ్మెల్సీనా..? కార్పొరేషన్ చైర్మెనా..? వేచి చూడాల్సిందే
- కోమటిరెడ్డి బ్రదర్స్ మాట నిలబెట్టుకునేనా...!

నవతెలంగాణ-నకిరేకల్



నకిరేకల్ నియోజకవర్గ కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దైద రవీందర్‌కు నామినేటెడ్ పదవి దక్కేనా.. అని పలువురు చర్చించుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నామినేటెడ్ పదవి ఇప్పిస్తానని కోమటిరెడ్డి బ్రదర్స్ హామీ ఇచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. నకిరేకల్ నియోజకవర్గ కేంద్రానికి చెందిన దైద రవీందర్ మాజీ ఎమ్మెల్యే దైద సుందరయ్య కుమారుడు. రవీందర్ తన తండ్రి పేరిట ఫౌండేషన్ ఏర్పాటు చేసి పేద ప్రజలకు ఆర్థిక సహాయం చేయడంలో ముందున్నారు. 2018లో కాంగ్రెస్ పార్టీ నుండి ఎమ్మెల్యేగా గెలుపొందిన చిరుమర్తి లింగయ్య బిఆర్ఎస్ పార్టీలో చేరిన తర్వాత కాంగ్రెస్ పార్టీకి పెద్దదిక్కు లేకుండా పోయింది. నాటి నుండి 2023 ఎన్నికల వరకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీని తన భుజస్కందాలపై వేసుకొని నడిపించారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి అనుచరుడుగా పేరొందిన రవీందర్ నాటి నుండి నకిరేకల్ నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృతంగా పర్యటిస్తూ నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారికి సేవ చేయడమే పరమావధిగా ముందుకెళ్లారు. ఏ కార్యకర్తకైనా కష్టంవస్తే నేనున్నానంటూ ముందుకెళ్లి వారి సమస్యలను పరిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపులను స్వీకరించి కార్యక్రమాలను నిర్వహించారు. కష్టపడి నియోజకవర్గంలో పార్టీని కాపాడుకుంటూ ఆర్థికంగా నష్టపోయి అధికార పార్టీ నుండి ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తట్టుకుంటూ కార్యకర్తలకు అండగా ఉన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో బిఆర్ఎస్ పార్టీలో ఉన్న అప్పటి మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రస్తుత మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో ఏఐసిసి జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరేశం కు నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ దక్కింది. అయినా రవీందర్ నిరుత్సాహానికి గురికాకుండా పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు. పార్టీ అధిష్టానం నిర్ణయించిన అభ్యర్థి గెలుపు కోసం కృషి చేశారు. జిల్లాలోనే అత్యధిక మెజార్టీతో వేముల వీరేశం ఎమ్మెల్యేగా గెలుపొందిన విషయం పాఠకులకు విధితమే. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంఘటితంగా ఉండి వీరేశం ను ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలన్న కసితో పని చేశారు. ఎన్నికల సమయంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నామినేట్ పదవి ఇప్పిస్తానన్న హామీ ఇచ్చినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున దైద రవీందర్ కు నామినేటెడ్ పదవి దక్కుతుందా.. లేదా.. అని పలువురు చర్చించుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారెంటీ పథకాల అమలుపై దృష్టి కేంద్రీకరించింది ఈ పథకాల అమలుపై ఓ క్లారిటీ వచ్చిన తర్వాత నామినేటెడ్ పదవుల పై దృష్టి సారించే అవకాశం ఉంది. రవీందర్ కు నామినేటెడ్ పదవి దక్కాలంటే మరికొంత కాలం వేచి చూడాల్సిందే.



రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

- క్రీడాకారులను అభినందించిన డీఈఓ

నవతెలంగాణ-భువనగిరిరూరల్

భువనగిరిలోని గణేష్ క్రికెట్ అకాడమీ కి చెందిన క్రీడాకారులు ఇటీవల ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన జిల్లా స్థాయి బాలుర క్రికెట్ టోర్నమెంట్‌లో విన్నర్స్ కప్‌ను సాధించినట్లు క్రికెట్ అకాడమీ వ్యవస్థాపకులు ఆబోతుల గండేశ్వర్ తెలిపారు. ఆదివారం భువనగిరిలో క్రికెట్ టోర్నమెంట్‌లో విజయం సాధించిన క్రీడాకారులను జిల్లా విద్యాశాఖ అధికారి కే.నారాయణరెడ్డి అభినందించారు.ఈ క్రీడాకారులు రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంటుకు ఎంపికైనట్లు ఆబోతుల గండేశ్వర్ తెలిపారు.విజయం సాధించిన క్రీడాకారులు హర్షవర్ధన్ రెడ్డి, విగ్నేష్, మణికంఠ, అలీలను, కోచ్ వినయ్ సింగును ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కె స్టాలిన్‌బాబులను పలువురు అభినం దించారు. కార్యక్రమంలో ఏవీ కేతన్, వినయ్‌సింగ్, శ్రీనివాస్, బబ్లు పాల్గొన్నారు.



ప్రభాకర్‌రావు మృతి తీరని లోటు

నవతెలంగాణ-మిర్యాలగూడ

తెలంగాణా రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు, విశ్రాంత తహశీల్దార్ మచ్చ ప్రభాకర్ రావు అకాల మృతి పద్మశాలి సమాజానికి తీరని లోటని మిర్యాలగూడ బీసీ జెఏసి కన్వీనర్ మరం శ్రీనివాస్, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాపోలు పరమేష్‌లు అన్నారు. ప్రభాకర్ హైద్రాబాద్‌లో ఆదివారం తెల్లవారు ఝామున హఠాత్తుగా గుండెపోటు తో మృతి చెందారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ అమరవీరుల స్థూపం వద్ద బీసీ జెఏసి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాలులర్పించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు పున్నా రాములు, నాయకులు తిరందాస్ విష్ణు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు పోలగాని వెంకటేశ్వర్లు గౌడ్ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాదగోని మహేష్, రాష్ట్ర నాయకులు ఋషికేశ్వర్ రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చామల కిరణ్ కుమార్ రెడ్డికి ఎంపీ టికెట్ ఇవ్వాలి

నవతెలంగాణ-శాలిగౌరారం



తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నల్గొండ జిల్లా శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు చామల కిరణ్ కుమార్ రెడ్డికి కాంగ్రెస్ అధిష్టానం భువనగిరి ఎంపి టికెట్ ఇవ్వాలని కాంగ్రెస్ గురజాల మండల నాయకులు పనికారే కృష్ణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ మొదలు కాంగ్రెస్ పార్టీలో క్రియ శీలకంగా జాతీయ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన కిరణ్ కుమార్ రెడ్డి ఏఐసీసీ నాయకులు రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశంలో 3 రాష్ట్రాలలో యూత్ కాంగ్రెస్ బలోపేతానికి ఎంతో కృషి చేశారన్నారు. ఇటీవల 2023 నవంబర్ లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం అహర్నిశలు పనిచేశారని, కిరణ్ కుమార్ రెడ్డికి ఎంపి టికెట్ ఇచ్చి సముచిత స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం కల్పించాలని కోరారు.



ఉచిత కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ-అడ్డగూడూరు

మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద అభయ మల్టీ స్పెషాలిటీ ట్రస్ట్ హాస్పిటల్ బోడుప్పల్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభించారు. అభయ మల్టీస్పెషల్ ట్రస్ట్ హాస్పిటల్ ఎండి డాక్టర్ గోలి వేణురెడ్డి తన సొంత మండలమైన అడ్డగూడూర్ మండల ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో అభయ మల్టీ స్పెషాలిటీ ట్రస్ట్‌హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత క్యాంపు నిర్వహించి బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అభయ ట్రస్ట్ కోఆర్డినేటర్ గోలి రాంరెడ్డి, మాజీ సర్పంచ్ గోలి రాంరెడ్డి, కడారి రమేష్, మారిశెట్టి మల్లేష్, జహంగీర్ ,వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

- కేఎస్ఎం డిగ్రీ కళాశాలలో 1994-97బ్యాచ్ విద్యార్థుల గెట్ టూ గెదర్

నవతెలంగాణ-మిర్యాలగూడ

పాతజ్ఞాపకాలు నెమరవేసుకుంటూ గడచిపోయిన గత మధుర స్మృతులను గుర్తుచేసుకుంటూ చదువు నేర్పిన గురువులకు దక్షిణగా సన్మానిస్తూ.. తమతో చదివిన మిత్రులతో పాత అనుభవాలు, ప్రస్తుత స్థితి గతులను పంచుకుంటూ..1994-1997బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని కేఎస్ఎం డిగ్రీ కళాశాలలో జరిగింది. 1994-97లో బిఏ చదివిన విద్యార్థిని విద్యార్థులు 27 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేసి కలుసుకున్నారు. విద్యార్థులు మిత్రులతో గడిపిన క్షణాలు, గత జ్ఞాపకాలను నాటి ఆనంద క్షణాలను మరోసారి గుర్తు చేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. కళాశాల అధ్యాపక బృందంను ఘనంగా సత్కరించారు. తమతో పాటు చదువుకొని సంగారెడ్డి డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న డి.దేవుజాను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఇంచార్జి ప్రిన్సిపాల్ రామ్ రెడ్డి,మాజీ ప్రిన్సిపాల్ యాదగిరి రెడ్డి, కోటేశ్వరరావు, ప్రభాకర్ రావు, రాజేశ్వరి, శ్రీనివాస్ చారి,, చంద్రయ్య పూర్వ విద్యార్థుల కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు మాలోతు దశరథ నాయక్, శ్రీనివాస్, హరి,రాంప్రసాద్,అరవింద్, పరిమళ, వెంకటమ్మధనలక్ష్మి, సునంద తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

నవతెలంగాణ-కొండమల్లేపల్లి



కొండమల్లేపల్లి మండల పరిధిలోని గన్యనాయక్ తండ, దంజి లాల్ తండా గ్రామంలో నెలకొన్నటువంటి మౌలిక సమస్యల పరిష్కారానికి తనవంతు సహాయంగా కృషి చేస్తానని కొండమల్లేపల్లి ఎంపీపీ దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డిలు అన్నారు. ఆదివారం ఆయా గ్రామాలను సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు త్రాగునీరు విద్యుత్ డ్రైనేజీ వంటి సమస్యలను దృష్టికి తీసుకురావడంతో అట్టి సమస్యలు అన్నిటిని పరిష్కరిస్తారని అన్నారు. అనంతరం ఆ గ్రామంలో ఉన్నటువంటి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయ కొట్టారు వీరి వెంట వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ఆర్ జగన్ నాయక్, అతనిలాల్, సక్రు నాయక్, రమేష్ నాయక్, హాతిరాం నాయక్, మంగ్య నాయక్, లస్కర్, సేవా, ఖదీర్ గ్రామస్తులు పాల్గొన్నారు.



బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షునిగా దుర్గయ్య

నవతెలంగాణ-మిర్యాలగూడ

బీసీ సంక్షేమ సంఘం నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులుగా పట్టణానికి చెందిన ఎర్రబెల్లి దుర్గయ్యను నియమిస్తున్నట్లు నియామక పత్రాన్ని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీల జనగనన చేయాలని బీసీల జనగణన చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. నూతనంగా నియామకమైన ఎర్రబెల్లి దుర్గయ్య మాట్లాడుతూ నా మీద నమ్మకం ఉంచి నాకు ఈ పదవి ఇచ్చినటువంటి జాజుల లింగం గౌడ్ గారికి కృతజ్ఞతలీజ్ తెలియజేశారు.బీసీల సమస్యల కోసం నిరంతరం పోరాడుతానని దుర్గయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, కుమ్మరి కుంట్ల సుధాకర్, మహేష్, రాంబాబు యాదవ్ పాల్గొన్నారు.

క్రికెట్లో అండర్ 23 కి సెలెక్ట్ అయిన ఊరుమడ్ల వాసి

నవతెలంగాణ-చిట్యాలటౌన్



చిట్యాల మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన పాకాల మధు యంగ్ స్టార్ క్రికెట్ లీగ్ తెలంగాణ అండర్ 23 స్టేట్ మ్యాచ్ కు సెలెక్ట్ అయిన సందర్భంగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆదివారం నకిరేకల్ క్యాంపు కార్యాలయంలో సన్మానించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కోనేటి యాదగిరి, చెరుక సైదులు, బొడ్డు శ్రీను, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-చిట్యాలటౌన్



చిట్యాల మున్సిపాలిటీ కేంద్రంలో ఆదివారం గౌడ సంక్షేమ సంఘ సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఎన్నికున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గౌడ సంఘం సీనియర్ నాయకులు మారగోని ఆంజనేయులు గౌడ్ పాల్గొన్నారు. ఈఎన్నికలో అధ్యక్షులుగా మారగోని రమేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా పబ్బతి సత్యనారాయణ గౌడ్, కోశాధికారిగా రేకుల గడ్డ నరసింహ గౌడ్, ఉపాధ్యక్షులుగా మేకల సురేష్ గౌడ్,పంతంగి వెంకన్న గౌడ్, ఉయ్యాల మల్లేష్ గౌడ్,పుల్లెంల చంద్రయ్య గౌడ్,కాసుల సత్యనారాయణ గౌడ్ సహాయ కార్యదర్శిలను, సలహాదారులను, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది ఈకార్యక్రమానికి మేకల శివ గౌడ్ అధ్యక్షత వహించగా, గౌరవాధ్యక్షులు పెద్దగోని మల్లయ్య గౌడ్, మేకల అంజన్ కుమార్ గౌడ్, గౌడ యువజన అధ్యక్షులు మారగోని శ్రవణ్ గౌడ్, బిక్షం గౌడ్, పల్లె వెంకన్న గౌడ్ ,ముద్దగొని శ్రీనివాస్ గౌడ్, మాధగోని వెంకటేష్ గౌడ్, వీరమల్ల అంజయ్య గౌడ్, కునూరి అంజయ్య గౌడ్, బొడ్డు శంకర్ గౌడ్, నేలపట్ల సంతోష్ గౌడ్ పాల్గొన్నారు.

బండారువీరయ్య మృతి పట్ల ఎమ్మెల్యే సంతాపం



నవతెలంగాణ-నకిరేకల్

నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డుకు చెందిన బండారు వీరయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.



తెలంగాణ ఉద్యమకారుడు వీరయ్య మృతి

నవతెలంగాణ-నకిరేకల్

నకిరేకల్ పట్టణానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు బండారు వీరయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దైద రవీందర్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-పెద్ద అడిశర్లపల్లి

మద్యపానానికి బానిసై ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకోని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం మండలం లోని తిరుమలగిరి గ్రామంలో చోటుటుచేసుకుంది. గుడిపల్లి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తిరుమలగిరి గ్రామానికి చెందిన భాషి పాక భాస్కర్(45) లారీ డ్రైవర్ గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో శనివారం సాయంత్రం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. మృతుని కుమారుడు భాషిపాక సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-మర్రిగూడ

మర్రిగూడ మండలం శివన్నగూడ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1989-1990 పదవ తరగతి బ్యాచ్ కి సంబంధించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు.ఆనాటి ఉపాధ్యాయులు,విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని తమ తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకొని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుంభ మదన్ రెడ్డి,సోమారెడ్డి,లాల్ నాయక్ సర్పంచ్ చిట్యాల సబిత యాదగిరి రెడ్డి,మాజీ సర్పంచ్ చెరుకు లింగం గౌడ్,సిరి ప్రగడ ఆనందరావు,రాపోలు యాదగిరి చిట్యాల రంగారెడ్డి,పూర్వ విద్యార్థులు వంగాల యాదగిరి రెడ్డి, శ్రీశైలం, ముడిగ నరసింహ, బోడ వెంకటయ్య , ముడిమాలపు శ్రీను ,వెంకట్ రెడ్డి, నర్మదా, ధనమ్మ ఎల్ వెంకటయ్య, వేణు సమ్మారెడ్డి, శ్రీను, అయితగోని వెంకటయ్య పెంటాజీ, నాగబండి నరసింహ, నక్క యాదయ్య, బన్సీలాల్ మహేందర్, అజ్మత్ అలీ పాల్గొన్నారు.

జానారెడ్డి నివాసానికి అయోధ్య శ్రీరామ అక్షింతలు

నవతెలంగాణ-నాగార్జునసాగర్

అయోధ్య శ్రీరామ అక్షింతలను ఇంటింటికి పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ మాజీ,సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి మరియు నాగార్జున సాగర్ శాసనసభ్యులు కుందూరు జయవీర్ రెడ్డి నివాసానికి హాలియా శ్రీరామ భక్తులు వెళ్లి అక్షింతలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీరామ భక్తులు తదితరులున్నారు.

ఆటో బోల్తా- పలువురికి గాయాలు

నవతెలంగాణ- చిట్యాల టౌన్



చిట్యాల మండలంలోని గుండ్రంపల్లి గ్రామ శివారులో 13 మంది కూలీలు తమ కూలి పనులు ముగించుకొని ఇంటికి వస్తున్న క్రమంలో జేబీ వెంచర్ వద్ద గల జింకల బొమ్మ సర్కిల్ వద్ద సాయంత్రం 6:30 గంటల సమయంలో ఆటో డ్రైవర్ నరసింహ అజాగ్రత్తగా నడిపి ఆటోను రోడ్డు పక్కన బోల్తా పడవేగా ఇందులో ప్రయాణిస్తున్న కూలీలు మాలిగ దివ్య, బత్తుల అండలు లకు తీవ్రగాయాలు కాగా వీరిని చికిత్స నిమిత్తం చౌటుప్పల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చిట్యాల ఎస్ఐ ఇరుగు రవి తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
సోమవారం | జనవరి 08. 2024 | www.navatelangana.com

నకిరేకల్ ఎమ్మెల్యేకు సన్మానం

నవతెలంగాణ-భువనగిరి

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంను భువనగిరి బార్ ప్రెసిడెంట్ నాగారం అంజయ్య, ఐలూ జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకటరెడ్డి ఆదివారం హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం యాదాద్రిభువనగిరి జిల్లా కోర్టు జిల్లాలోని రామన్నపేట ఇతర కోర్టు పెండింగ్ సమస్యల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలోని వివిధ కోర్టులలో పెండింగ్ సమస్యలు పరిష్కారానికి తన వంతు సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. వీరి వెంట అడ్వకేట్ రఘుపతి, సైదులు,బాలు ఉన్నారు.



టోర్నమెంట్‌ను ప్రారంభించిన సింగిల్ విండో చైర్మెన్

నవతెలంగాణ-బొమ్మలరామరం

మండలంలోని యావపూర్‌తండాలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం బొమ్మలరామారం మండల సింగిల్ విండోచైర్మెన్ గూదె బాలనర్సయ్య ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో పాటు చదువులో కూడా రాణించాలన్నారు. క్రీడలతో విద్యార్థిని విద్యార్థులకు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృఢత్వం పెంపొందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకటేష్‌గౌడ్, సర్పంచ్ శ్రీని వాస్ నాయక్,తిమ్మాపూర్ ఎంపీటీసీ శ్రీహరినాయక్,క్రీడాకారులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ రేసులో జనగాం ఉపేందర్‌రెడ్డి..!

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు మండలం కొల్లూరు గ్రామానికి చెందిన,టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డికి ఈసారైనా సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవి ఇచ్చి గౌరవించాలని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శిగా కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి, ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ నుండి కీలకంగా పనిచేశారు. రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి పని చేశారు.ఆలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య గెలుపుకోసం పని చేశారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తో పాటు జనగామ ఉపేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుండి పలువురు మంత్రులకు ఆయన సుపరిచితులు.ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షులు సంజీవరెడ్డితో కలిసి కార్మికుల హక్కుల కొరకు పనిచేసిన అనుభవం ఆయనది. ఆలేరు పీఏసీఎస్ చైర్మెన్‌గా, నల్లగొండ జిల్లా సహకార సంఘం డైరెక్టర్‌గా రైతులకు సేవలందించారు.బాపుగా ఆయన అభిమానులు పిలుస్తారు.యాదాద్రి



భువనగిరి జిల్లా నుండి ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని కోరుతూ జిల్లా ప్రజలు, ఆయన అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ అధిష్టానాన్ని కోరుతున్నారు.

సేవా కార్యక్రమాలలో ఉపేందర్‌రెడ్డి

తనదైన శైలిలో కాంగ్రెస్ కోసం పని చేయడంతో పాటు ఆలేరు మండలంలోని విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, కళాశాల పాఠశాలల అభివృద్ధికి నిధులు వెచ్చించడం,బస్ షెల్టర్లు కట్టించడం , మంచినీటి సమస్యలు తలెత్తినప్పుడు ఆయా గ్రామాలలో మంచినీటి అవసరాలు తీర్చడం, నిరుపేదలకు బియ్యం పంపిణీ, ప్రజలకు కాంగ్రెస్ కార్యకర్తలకు ఆర్థిక సహాయం, ఇతర సేవా కార్యక్రమాలు నిర్వర్తిస్తూ వస్తున్నారు.

ప్రజల సౌకర్యార్థం ర్యాంపుల నిర్మాణం

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

నవతెలంగాణ-యాదగిరిగుట్ట

యాదగిరిగుట్ట పట్టణంలోని గాంధీనగర్ నుండి యదగిరిపల్లి వరకు ఉన్న హైవే రోడ్డు నుండి ప్రజలప్రయాణానికి అనువుగా ఉండటం కోసం ర్యాంపుల నిర్మిస్తున్నట్లు ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య తెలిపారు.ఆదివారం యదగిరిపల్లి, వంగపల్లి,గాంధీ నగర్,మల్లాపూర్,బీసి కాలనీ కి వెళ్లే ప్రజలకు సౌకర్యంగా ఉండడం కోసం ర్యాంపులకు ఆయన శంకుస్థాపన చేశారు.అనంతరం యాదాద్రి ఆలయ అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేసిన నూతన నిర్మాణ వ్యాపార సముదాయాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాలోచితంగా రోడ్డు నిర్మించడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, ర్యాంపుల నిర్మాణం చేపట్టడంతో ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని, ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే విద్యార్థులు కూడా ఈ ర్యాంపుల వల్ల రోడ్డు దిగి వెళ్ళటానికి సౌకర్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ సుధా హేమేందర్‌గౌడ్,వైస్‌చైర్మెన్ కాటం రాజు,కౌన్సిలర్లు సీస విజయలక్ష్మి కృష్ణ,ముఖ్యర్ల మల్లేష్,బిట్టు హరీష్,భరత్ గౌడ్,పట్టణ అధ్యక్షుడు బంధారపుభిక్షపతి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కానుగు బాలరాజ్ గౌడ్,అధికారులు ఆర్‌అండ్‌బీ ఈఈ శంకరయ్య,జేఈలు భరత్,కరుణాకర్ పాల్గొన్నారు.





డీడీలు చెల్లించిన గొల్ల కురుమలకు వెంటనే గొర్రెలు పంపిణీ చేయాలి

- జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి మద్దెపురం రాజు

నవతెలంగాణ-భువనగిరిరూరల్

రాష్ట్రవ్యాప్తంగా గొర్రెల కోసం డీడీలు చెల్లించిన గొల్ల కురుమలకు వెంటనే గొర్రెల పంపిణీ చేయాలని,గొర్రెల పంపిణీ పథకాన్ని కొనసాగించాలని గొర్రెల మేకల పెంపకందారుల సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి మద్దెపురం రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జీఎంపీఎస్ జిల్లా కమిటీ సమావేశం భువనగిరిలోని వృత్తిదారుల కార్యాలయంలో దయ్యాల నర్సింహ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.డీడీలు చెల్లించిన గొల్ల కురుమలు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 80వేల మంది ఉండగా భువనగిరి జిల్లాలో 342 మంది ఉన్నారని తెలిపారు. ఒక్క యాదాద్రి భువనగిరి జిల్లాలోనే 342 మంది ఒక్కొక్కరు ? 43,750 రూపాయల చొప్పున ? 1,49,62,500 రూపాయలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలో జమచేసి గొర్రెల కోసం ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వం డీడీలు చెల్లించిన గొల్ల కురుమలందరికీ రైతుబంధు మాదిరిగానే గొర్రెల పంపిణీ పథకాన్ని కొనసాగించాలని కోరారు.ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు బండారు నర్సింహ, ఉపాధ్యక్షులు బుడుమ శ్రీశైలం, సహాయ కార్యదర్శులు ఎల్లంల సత్యనారాయణ, కొండె శ్రీశైలం, జిల్లా కమిటీ సభ్యులు తుమ్మేటి బాలకృష్ణ, జెట్ట చిరంజీవి, ఎల్లముల వెంకటేష్, తెల్జూరి మల్లేష్, గుండెబోయిన స్వామి లు పాల్గొన్నారు.

టీఎస్‌యుటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-నార్కట్‌పల్లి





టీఎస్ యుటిఎఫ్ నార్కట్ పల్లి మండల శాఖనూతన కమిటీ ని శనివారం రాత్రి జరిగిన.మండలమహాసభలో ఎన్ను కున్నారు.అధ్యక్షులుగా మండల పరిషత్ కొత్తగూడెం ప్రధానోపాధ్యాయులు ఎస్ భానుప్రకాష్, ప్రధాన కార్యదర్శి గా తొండలవాయి ఉపాధ్యాయులు కే.వెంకన్న ఉపాధ్యక్షులు గా చెరువు గట్టు ఉపాధ్యాయులు. ఎస్ పద్మ నక్కలపల్లి ఉపాధ్యాయులు జి ఆదినారాయణ, కోశాధికారి గా ప్రాథమిక పాఠశాల. తిరుమలగిరి ఉపాధ్యాయులు నర్ర రవీందర్ రెడ్డి, ఏ కగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఏకే పౌండేషన్ మరో గొప్ప అవకాశం

నవతెలంగాణ-పెద్దవూర

నాగార్జున సాగర్ నియోజకవర్గంలో ఏకే పౌండేషన్ ఆధ్వర్యంలో కొన్ని సంవత్సరాలుగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కట్టేబోయిన అనిల్ కుమార్ యాదవ్, విద్యార్థులకు చదువులకు తోడ్పాటు అందించేందుకు మరో కొత్తకార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పౌండేషన్ ఆధ్వర్యంలో మిర్యాలగూడకు చెందిన కేవీఆర్ అకాడమీ ద్వారా గ్రామీణ విద్యార్థులకు ఐఐటి, జేఈఈ, నీట్‌లో ఉచిత శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అతిత్వరలో 6వ తరగతి నుంచి ఇంటర్ మీడియట్ చదువుతున్న విద్యార్థులకు ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ పరీక్షల్లో మెరిట్ సాధించిన విద్యార్థులకు అకాడమీ హైదరాబాద్ ప్యాకల్టీ చే హలియా పట్టణంలో సమ్మర్ క్యాంప్ ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్టు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



సినీనటి పావలా శ్యామలకు సహాయం

నవతెలంగాణ-నకిరేకల్

సినీ నటి పావలా శ్యామల కు ఆర్థిక సహాయం అందజేసి నకిరేకల్ లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ మానవత్వం చాటుకుంది. హైదరాబాద్ బోడుప్పల్‌లో ఉన్న ఓల్డ్ ఏజ్ హెూమ్‌లో దుర్భర జీవితం గడుపుతున్న పావలా శ్యామలను ఫౌండేషన్ ప్రతినిధులు ఆదివారం కలిసి రూ. 20 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. గుండె రంధ్రంతో బాధపడుతూ వైద్యం చేయించుకోలేని దుస్థితిలో ఉన్న శ్యామల పేదరికంతో కడుపు నింపుకోవడమే కష్టంగా ఉన్న విషయాన్ని తెలుసుకున్న ఫౌండేషన్ ప్రతినిధులు ఆమెను కలిసి సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు బ్రహ్మదేవర నరేష్, కర్నాటి నరేష్, తాటి మురళి, బొడకుంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-నకిరేకల్

నకిరేకల్ పట్టణానికి చెందిన ఎస్‌పి ఎం కార్మికుడు బొడ్డు సైదులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు ఆదివారం ట్రాన్స్ఫార్మర్స్ రిపేరింగ్ కార్మికులు ఆధ్వర్యంలో రాష్ట్ర కార్మికులు అందజేసిన రూ. 34,300 ఆర్థిక సహాయాన్ని సైదులు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు బొమ్మకంటి జానకిరాములుగౌడ్, తేరాల శ్రీనివాస్, చిన్న శ్రీను, సైదిరెడ్డి, జిడుగు సోమయ్య, గణేష్, సందీప్, అంజయ్య, రాములు, నజీర్, కృష్ణ, వెంకన్న, వెంకటేష్, ఎస్సార్. శ్రీను, ఆర్. శ్రీను పాల్గొన్నారు.



వాలీబాల్,ఫుట్‌బాల్, ఇతర క్రీడలకు కూడా ఆదరణ ఉండాలి

నవతెలంగాణ-చౌటుప్పల్‌రూరల్



వాలీబాల్,ఫుట్‌బాల్, ఇతర క్రీడలకు కూడా ఆదరణ ఉండాలని గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ రామన్నపేట ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ అనిత అన్నారు.మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ పరిధిలో జరుగుతున్న అంతర్ కళాశాల క్రీడా పోటీలలో భాగంగా డాక్టర్ ఎంఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ తంగడపల్లి క్రీడా మైదానంలో ఐదవ రోజు ఆదివారం జరిగిన క్రికెట్‌పోటీలో ఉదయం 9.30 గంటల సమయంలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ వర్సెస్ మహాత్మా గాంధీ యూనివర్సిటీ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ రామన్నపేట తలపడ్డాయి. ఈ మ్యాచ్ లో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ వర్సెస్ మహాత్మా గాంధీ యూనివర్సిటీ 7 వికెట్ల తేడాతో గెలుపొం దింది.ఈ మ్యాచ్‌లో అత్యుత్తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించి ఎం.రవీంద్ర బౌలింగ్‌లో మూడు వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. ఈరోజు మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో జరిగిన రెండవ మ్యాచ్‌లో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ వర్సెస్ ఎన్జీ కాలేజీ (A) నల్గొండ తలపడ్డాయి.ఈ మ్యాచ్‌లో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ వర్సెస్ మహాత్మా గాంధీ యూనివర్సిటీ 5 వికెట్లు తేడాతో గెలుపొందింది.ఈ మ్యాచ్లో అత్యుత్తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించి ఆకాష్ బౌలింగ్‌లో 5 వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.తదుపరి జరిగిన మూడో మ్యాచ్ రెండున్నర గంటలకు మొదలవగా డాక్టర్ మధుసూదన్ రెడ్డి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ తంగడపల్లి వర్సెస్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ మహాత్మాగాంధీ యూనివర్సిటీ తలపడ్డాయి.ఈ మ్యాచ్ లో మొదటిగా బ్యాటింగ్ చేసిన డాక్టర్ ఎంఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ తంగడపల్లి 4 వికెట్స్ కోల్పోయి 125 రన్స్ చేసింది.ఎస్. సాయి వంశీ 50 పరుగులు చేసినారు నాటౌట్‌గా నిలిచారు.ఈ మ్యాచ్ లో డాక్టర్ ఎంఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ 83 పరుగులు తేడాతో ఘనవిజయం సాధించింది.ఈ మ్యాచ్లో ఎస్ సాయి వంశీ 50 పరుగులు చేసి రెండు వికెట్లు తీసుకొని మాన్ ఆఫ్ ది మ్యాచ్ గెలుపొందాడు.డాక్టర్ ఎంఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ తంగడపల్లి చౌటుప్పల్ లో ఉన్న వసతులను గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ రామన్నపేట ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ అనిత చూసి యజమాన్యాన్ని అభినందించారు.ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అబ్జర్వర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యనారాయణ రాజు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ, ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్‌కుమార్ సాహు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ దిలీప్ కుమార్, ఫ్యాకల్టీ మెంబర్స్ జె.ప్రసాద్‌రావు, విజయరాణి పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటులో భాగస్వాములమవుతాం

- మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ పోత్నక్ ప్రమోద్‌కుమార్

నవతెలంగాణ-భువనగిరిరూరల్

భువనగిరి పట్టణ 10, 26వ హౌసింగ్ బోర్డ్ కాలనీలో సీసీకెమెరాల ఏర్పాటు కొరకు స్థానిక కౌన్సిలర్ మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ పోత్నక్ ప్రమోద్ కుమార్ 26వ కౌన్సిలర్ ఈరపాక నరసింహ ఆధ్వర్యంలో స్థానిక కమిటీ హాల్ వద్ద సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ స్థానిక కౌన్సిలర్ పోత్నక్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ వార్డులో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం డీసీపీ రాజేష్ చంద్ర గతవారం హౌసింగ్ బోర్డ్ కాలనీలో సేవ్ వార్డు ఏర్పాటు చేయడం కోసం ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా సేఫ్ జోన్ కాలనీగా తీర్చిదిద్దాలని మొదటగా హౌసింగ్ బోర్డ్ కాలనీ పైలెట్ ప్రాజెక్టుగా ప్రకటించి సీసీ కెమెరాలు సైన్ బోర్డ్స్ స్పీడ్ బ్రేకర్లు ప్రజలంతా భాగ్యస్వామ్యం అవుతామని ఏకగ్రీవంగా ఆమోదించామన్నారు.ఎ నూతనంగా వార్డు డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు, ట్రెజరర్‌ను నియమించుకున్నారు.ఈ కార్యక్రమంలో మాటూరి బాలేస్వర్, మెరుగు మధు, శ్రీధర్‌రెడ్డి,బర్రె ప్రమీల, పిన్నింటి బలరాంరెడ్డి, ఆగేష్, అమానతుల్ల సోమన్న , సుకుమార్, పాండు, సీనారెడ్డి, లక్ష్మారెడ్డి, రాజు, గాదె కిషన్ పాల్గొన్నారు.

పిట్టల బాలరాజు జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-భువనగిరి

కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి పిట్టల బాలరాజు జన్మదిన వేడుకలు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా వారు మాట్లాడు తు పిట్టల బాలరాజు కాంగ్రెస్‌కు ఎనలేని సేవలు చేశారని తెలిపారు. రానున్న రోజుల్లో ఉన్నత శిఖరాలుఅధిరోహించాలని ఆ భగవంతున్ని వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో కూర వెంకటేష్, బర్రె జహంగీర్,కౌన్సిలర్ ఖైరంకొండ వెంకటేష్, జగన్,వడిచర్ల కృష్ణయాదవ్, డాకూరి ప్రకాష్ పాల్గొన్నారు.



స్థానిక బలంతో సమస్యల పరిష్కారానికి పోరాడుతాం

నవతెలంగాణ-నల్గొండ టౌన్

జిల్లా కమిటీ నిర్మాణం ద్వారా స్థానిక బలంతో దశల వారి కార్యక్రమం చేపట్టి సమస్యల పరిష్కారానికి పోరాడుతామని మైనారిటీ గురుకుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు తెలిపారు. టీఎస్ యుటిఎఫ్ మైనారిటీ గురుకుల నల్గొండ ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జిల్లా కేంద్రంలోని యుటిఎఫ్ ప్రధాన కార్యాలయం లో జరిగింది. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కమిటీల నిర్మాణంతో భవిష్యత్తు కార్యక్రమాలు మరియు మైనార్టీ గురుకుల వ్యవస్థ ఇతర సొసైటీలు ఒకే గొడుగు తీసుకురావాలని కోరారు. మహేష్, నరసింహ మాట్లాడుతూ అన్ని జిలాల్లో సంఘ నిర్మాణ పనులు సమర్థవంతంగా నిర్వహించి ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారానికి ముందుకు వెళతాం అని. తెలిపారు. అనంతరం ఉమ్మడి జిల్లా మైనారిటీ గురుకుల విభాగంలో ఎన్నిక జరిగింది.ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షులు గా బొళ్ళెం కృష్ణ మూర్తి , ప్రధాన కార్యదర్శి ప్రసాద్, కోశాధికారిగా కోమటి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు గా జ్యోతి బాబు, నూర్జహాన్, జిల్లా కార్యదర్శులు గా శంకర్, కె. రమాదేవి, అబ్దుల్ ముజీబ్, జంగయ్య, శ్వేత, అనిత మరియు ఉమ్మడి జిల్లా లో ఉన్నటువంటి మూడు జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు కోశాధికారుల నియామకం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు జి. క్రాంతి కుమార్, బొల్లం కృష్ణమూర్తి, జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు కొప్పుల జనార్ధన్, లక్ష్మణ్, వివిధ జిల్లాల మైనార్టీ గురుకులాల ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పేదలకు ప్రభుత్వాస్పత్రిలో అన్ని రకాల వైద్యసేవలందించాలి

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

నవతెలంగాణ-చౌటుప్పల్



పేద ప్రజలకు ప్రభుత్వాస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో నూతనంగా నిర్మాణం చేస్తున్న వంద పడకల ప్రభుత్వాస్పత్రిని ఆయన ఆకస్మికంగా సందర్శించి, నిర్మాణ పనులను పరిశీలించారు. ఆస్పత్రిలోని రోగులతో మాట్లాడి, వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ వంద పడకల ఆస్పత్రిని భవిష్యత్ తరాలకు అందజేయాలని ఇంజనీర్లు, డాక్టర్లకు సూచించారు.ఆస్పత్రిలో పేదలకు ఉచిత వైద్యం అందించాలంటే డాక్టర్లు సక్రమంగా ఉండాలన్నారు. మిషనరీ వ్యవస్థ అందుబాటులో ఉండాలని తెలిపారు.నార్మల్ డెలివరీ కావాల్సిన పేషెంట్లను కూడా ప్రయివేట్ ఆసుపత్రులకు పంపించి ఆపరేషన్లు చేస్తున్నారని, ప్రభుత్వ డాక్టర్లు ఈ ధోరణిని మార్చుకోవాలని సూపరింటెండెంట్‌కు తెలిపారు. పేద ప్రజలను దోపిడీ చేస్తే ఏ ఒక్క ప్రయివేట్ ఆస్పత్రిని వదిలేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ వెన్‌రెడ్డి రాజు, ఎంపీపీ తాడూరి వెంకటరెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అలివేలు, డాక్టర్ కాటంరాజు, కౌన్సిలర్ కొయ్యడ సైదులుగౌడ్, నాయకులు మొగుదాల రమేశ్‌గౌడ్, సందగల్ల సతీశ్‌గౌడ్, బక్క శ్రీనాథ్ పాల్గొన్నారు.



జిల్లాస్థాయి గ్రామీణ క్రీడల మైదానాన్ని పరిశీలించిన జిట్ట బాలకృష్ణారెడ్డి

నవతెలంగాణ-భువనగిరిరూరల్

భువనగిరి పట్టణంలోని సీఎస్ఎన్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 12,13,14వ తేదీల్లో నిర్వహించే సంక్రాంతి సంబురాల సందర్భంగా జిల్లా స్థాయి గ్రామీణ క్రీడల సన్నాహక సమావేశం నిర్వహించారు. క్రీడామైదానాన్ని పరిశీలించిన తెలంగాణ ఉద్యమ నాయకులు జిట్టా బాలకృష్ణారెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు గోమరి సుధాకర్‌రెడ్డి, అజీముద్దీన్, అందె శంకర్,నాయకులు బద్దం భాస్కర్ రెడ్డి ,కుసంగి రాములు, చిలుగురి సత్తి రెడ్డి,చింతల లక్ష్మీనారాయణ, కుశంగుల రాజు, బచ్చు శ్రీనివాస్, భాషబోయిన రాజేష్, పట్నం కమలాకర్, బెల్లి చంద్రశేఖర్, హమీద్ పాషా, రత్నాపురం శ్రీనివాస్, దాసరి శ్రీనివాస్,సుధగని రాజు, సరగడ కరుణ్, ముద్దంసత్యం,బొల్లు శ్రీనివాస్,చెన్న మహేష్,గాదె శ్రీనివాస్, తాడెం రాజశేఖర్, తాడూరి భిక్షపతి, దర్గాయి గణేష్, నీల భాను,బరిగే శంకర్ పాల్గొన్నారు.

పదో తరగతి మెమో పోయినది

నేను అనగా **బత్తుల సౌమ్య** తండ్రి నాగయ్య గ్రామం : చిల్పకుంట్ల, మండలం: నూతనకల్, జిల్లా : సూర్యాపేట. తేదీ 03-01-2024న చిల్పకుంట్ల నుండి సూర్యాపేటకు బస్సులో ప్రయాణిస్తుండగా పదవ తరగతి మేమో పోయినది. ఎవరికైనా కనబడిన లేదా దొరికిన ఈ క్రింది నెంబర్ కు సమాచారం అందించగలరు

సెల్.9705128682.

ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని నిర్మాణాత్మకంగా బలోపేతం చేయాలి

నవతెలంగాణ-భువనగిరి

శాస్త్రీయంగా, సైతాంతికంగా నిర్మాణాత్మకంగా ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని బలోపేతం చేస్తూ క్షేత్రస్థాయి కమిటీలు వేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు, నరేష్,జాతీయ నాయకులు తిప్పారపు లక్ష్మణులు పిలుపునిచ్చారు. ఆదివారం భువనగిరిలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమావేశం నిర్వహించారు.సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి దేవేందర్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత కోసం మాదిగ జాతి చేస్తున్న ఉద్యమం ప్రస్తుతం చాలా కీలక దశకు చేరిందన్నారు. నూతన కమిటీల నిర్మాణం చేపడుతూ జాతిని చైతన్యం చేస్తూ భవిష్యత్ పోరాటాలకు సిద్ధం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్, నాయకులు కొమ్ము శేఖర్, నవీన్‌చారి, దుబ్బ రామకృష్ణ, నల్ల చంద్రస్వామి, సందెల శ్రీనివాస్, కొల్లూరు హరీష్ పాల్గొన్నారు.

కర్నాటక మంత్రిని సన్మానించిన ఎమ్మెల్యే కుంభం

నవతెలంగాణ-భువనగిరి

కర్నాటక మంత్రి బోస్‌రాజు కొలనుపాకలోని జైన్‌మందిర్ ఆలయానికి వస్తున్న సందర్భంగా ఆయనకు ముందుగా భువనగిరి పట్టణంలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన జైన్ మందిర్‌కు చేరుకొని ఆలయాన్ని సందర్శించ నున్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ తంగళ్ళపల్లి రవికుమార్, వలిగొండ ఎంపీపీ వెంకటేశ్, మున్సిపల్ మాజీ చైర్మెన్ బర్రె జహంగీర్,కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కూర వెంకటేష్, నాయకులు పిట్టల బాలరాజు, వడిచర్ల కృష్ణ పాల్గొన్నారు.

